ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి




తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శుక్రవారం 20 సెప్టెంబరు 2024 | 3

నేటి నుంచి 'మన మంచి ప్రభుత్వం'

జనంలోకి ప్రజాప్రతినిధులు

కూటమి ప్రభుత్వం పాలన 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంచి ప్రభుత్వం పేరుతో కూటమి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుతో అం దరూ ప్రజల వద్దకు వెళ్లి ఇప్పటి వరకూ చేసిన పనులు చేయబోయే పనుల గురించి ప్రజలకు వివరించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోనూ శుక్రవారం ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమం ప్రారంభిస్తారు. నియోజకవర్గాల్లో మన మంచి ప్రభుత్వం సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరిస్తారు.



హైవేలో లైట్లు వేయాలని ఎప్పుడో లేఖ రాశాం

- చిరుతను బంధించడానికి చర్యలు
- హైవేలోనూ సీసీ కెమెరాల ఏర్పాటు
- ఊర కుక్కలు..పందులే ఆహారం
- 'ఆంధ్రజ్యోతి'తో డీఎఫ్‌వో భరణి



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజర్వు ఫారెస్టులో సంచరిస్తున్న చిరుత పులిని బంధించడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుం టున్నామని'ఆంధ్రజ్యోతి'కి జిల్లా ఫారెస్టు అధికారి (ఇన్‌చార్జి) భరణి తెలిపారు. అభయారణ్యం ఆనుకొని ఉన్న ఆవాసాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. చిరుత పులి ప్రస్తుతం దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోమాత్రమే తిరుగుతుందని తెలిపారు. పులి జాడ కనుగొనేందుకు గత 13 రోజులుగా 100 ఫ్లాష్ కెమెరాలు, 7 ట్రాప్ కేజ్‌లు, 10 సీసీ కెమెరాల ద్వారా ప్రత్యక్షవీక్షణం చేస్తున్నామన్నారు. కేంద్ర పర్యావరణశాఖ ఆధ్వర్యంలో ఉన్న న్యూఢిల్లీలోని ఎన్‌టీసీఏ, రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారుల సలహాలు సూచనలు మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఇంత వరకూ చిరుతపులి మనుషులమీద దాడిచేసిన దాఖలాలు లేవని తెలిపారు. చిరుతపులి ఊర కుక్కలు, పందులను ఆహారంగా తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు హాని జరగకుండా చిరుతపులిని బంధించడానికి అహర్నిశం శ్రమిస్తున్నామని తెలిపారు. జాతీయ రహదారిలో హెచ్చరిక బోర్డులు, కెమెరాలు ఏర్పాటు చేశామన్నా రు.రాత్రి వేళల్లో సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) కు లేఖ రాసి చాలా రోజులైందన్నారు. కానీ ఇప్పటి వరకూ ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. దీంతో శాఖల మధ్య సమన్వయ లోపం పులికి వరంగా.. ప్రజలకు శాపంగా మారిందనే వాస్తవం బయట పడింది. పులి జాతీయ రహదారిని అటూ ఇటూ దాటు తోందని అటవీ అధికారులు ఇప్పటికే నిర్ధారించారు. సరిపడా లైటింగ్ ఏర్పాటు చేస్తే వాహనదారులు దూరం నుంచే అప్రమత్తమై వాహన వేగం తగ్గించి సురక్షితంగా వెళ్లే అవకాశం ఉంటుంది. రాత్రి వేళల్లో అక్కడ చిమ్మచీకటి వల్ల ఒకవేళ రోడ్డు పక్కన పులి నక్కినా సమీపానికి వెళ్లే వరకూ తెలియదు. జాతీయ రహదారి పరిసరాల్లో కెమెరాలు ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ పులి రోడ్డు దాటుతున్నప్పుడు కెమెరాల్లో ఎందుకు ఫొటో పడలేదో తెలియదు.పులి దగ్గరగా వస్తే చేతులు ఊపుతూ కేకలు వేయండని దూరంగా ఉంటే నిశ్శబ్దంగా కదలకుండా ఉండండంటూ లాజిక్ చెబుతున్న అధికారులు.. అసలు పులి ఎదురుపడితే ఆ సమ యంలో సదరు వ్యక్తి పరిస్థితి ఏమిటో అంచనా వేయడంలో వెనకబడినట్టు వినవస్తోంది.ఇప్పటికైనా పులి సంచరించే పరిధిలో ఉన్న జాతీయ రహదారిపై సరిపడా లైట్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.ఏదేమైనా 'ఆపరేషన్ చిరుత' ఎలాంటి దుర్ఘటనలూ జరగకుండా సాధ్యమైనంత త్వరగా ముగియాలని ప్రజలు కోరు కుంటున్నారు.

ట్రాప్ కెమెరాలో అడవి పిల్లి 5

వందనం. అభివందనం



అధికారం అరాచకమై ఐదేళ్లు కారుచీకట్లు కమ్ముకున్న వేళ.. కాగడా పెట్టి వెదికినా పిసరంతైనా కనిపించని అభివృద్ధి జాడల నడుమ.. జీతాలు అసలు ఎప్పుడు వస్తాయో తెలి యని అత్యంత గడ్డు పరిస్థితుల మధ్య..పల్లె ప్రగతికి ప్రతిరూపాలైన పంచాయతీలను కకావికలం చేసిన పాలన సాక్షిగా.. పేదోడి ఆకలిపైనా రాజకీయ అక్కసు ప్రదర్శించి రాక్షసా నందం పొందిన నిరంకుశత్వం బద్దలై ప్రజల ఆకాంక్షల నుంచి ఉదయించిన కూటమి ప్రభుత్వానికి సరిగ్గా వంద రోజులు పూర్తయింది. ప్రజల ఆకాంక్షలకు పట్టం కడుతూ.. అభివృద్ధే కంకణంగా...ఇచ్చిన హామీలను ఒక్కోటిగా నిజం చేస్తూ..వైసీపీ అరాచకత్వంతో కుంటుపడ్డ జిల్లాకు మళ్లీ జవసత్వాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జిల్లా రూపురేఖ లను మార్చే దిశగా ఈ వందరోజుల్లో వడివడిగా ఎన్నో అడుగులు వేసుకుంటూ కదులుతోంది. ఈ వంద రోజుల పాలనకు జనం వంద మార్కులు వేసేసి.. వందనం.. అభివందనం అంటున్నారు. నియోజక వర్గాల్లో సమస్యలు తెలుసుకునేందుకు మన మంచి ప్రభుత్వం పేరుతో నేటి నుంచి ప్రజల్లోకి వస్తున్నారు..

- (రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వంద రోజుల పాలన సూపర్ హిట్.. ఇదీ ప్రజాభిప్రాయం..ఎందుకంటే కూటమి ప్రజా ప్రభుత్వం.. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు.. వృద్ధులు తదితర వర్గాలకు ఒకటినే పింఛన్లు.. కష్ట మొచ్చినా కన్నీళ్లు రాకుండా కాశారు.. అటువంటి ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయింది. వంద రోజుల్లో సీఎం చంద్రబాబు రెండు సార్లు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. అందుకే ప్రజలు ప్రజలు వంద మార్కులు వేసేశారు..అయితే సీఎం చంద్రబాబుకు మాత్రం ఇంకా ప్రజలకు ఏదో చేయలేకపోతున్నామనే వెలితి.. చేయాలనే కసి..అసలు పాలన ఎలా ఉంది.. ప్రజలకు నచ్చిందా లేదా.. ఏమైనా మార్పులు.. చేర్పులు ఉన్నాయా.. అంటూ నేటి నుంచి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్యటించాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగులకు ఒకటినే జీతాలు..

జిల్లాలో ప్రభుత్వసచివాలయ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 20వేల మందికిపైగానే ఉన్నారు. గత వైసీపీ పాలనలో అసలు జీతాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో ఠంచనుగా ఒకటో తేదీకే జీతాలు జమైపోతున్నాయి. సీఎం చంద్రబాబు చొరవ, ముందుచూపుతో ఉద్యోగుల జీతా లకు ఇబ్బందులు లేకుండా ఒకటో తేదీనే జమవుతుండడం పెద్ద మార్పు అని ఉద్యోగులంతా ముక్తకంఠంతో చెబుతున్న పరిస్థితి.గత ప్రభుత్వంలో ఉద్యోగులపై వేధింపులు,బూతులు, బెదిరింపులతో స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు ఉండేవి కావు.కూటమి వచ్చాక ఉద్యో గుల పనితీరులో స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడింది.

పింఛన్ టెన్షన్ తీర్చారు..

జిల్లాలో వృద్ధులు, వితంతులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీలకు చెందిన 2.40 లక్షల మందికి పింఛన్ నెలకు రూ.102 కోట్లు పంపిణీ చేస్తున్నారు. అప్పటి వరకు ఉన్న రూ.3వేల పింఛనును రూ.4వేలు చేసింది. దివ్యాంగులకు రూ.6వేలు,పూర్తిస్థాయి వైకల్యం చెందిన వారికి రూ.15వేలు, ఇతర వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు చొప్పున అందిస్తోంది. వాస్తవానికి నెలనెలా పింఛన్‌ను ఒకటో తేదీనే ఇంటికి వెళ్లి ఇస్తున్నామంటూ గత వైసీపీ సర్కారు హడావుడి చేసేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీనే సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది.

నేటి నుంచి జనంలోకి ఎమ్మెల్యేలు

- కూటమి పాలనకు వంద రోజులు
- ఒకటినే పింఛన్లు..జీతాలు
- దౌర్జన్యాల్లేవ్.. దాడుల్లేవ్
- మారిన పాలనా తీరు
- ప్రజల మన్నన..వంద మార్కులు
- ఒక్కొక్కటిగా హామీల అమలు

పంచాయతీలకు జవసత్వాలు..

జిల్లాలో 299 పంచాయతీలున్నాయి.గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసింది. వీటికి వచ్చే ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించేసింది. ఇలా పంచాయతీ వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైపోయింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ శాఖ పర్యవేక్షిస్తుండడంతో మళ్లీ పంచాయతీలకు మునుపటి గౌరవం దక్కేలా చేశారు. ఇటీవల జిల్లాలో పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. జెండా వందనం కోసం కేవలం రూ.2 వేలు ఉండే బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు డ్రాచేసుకునే స్వేచ్ఛ కల్పించింది. గ్రామసభలను ఒకేసారి నిర్వహించి రికార్డు సృష్టిం చింది.

దీపావళికి మూడు గ్యాస్ సిలిండర్లు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాలు ప్రకటించింది. అందులో ఒక్కో హామీని వడివడిగా అమలు చేస్తోంది. ఇప్పటికే పింఛన్ల పెంపు అమలు చేసింది. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వబోతోంది.ఇంటింటికి కుళాయిపైనా సమీక్షించింది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపైనా ఇప్పటికే అధ్యయనం పూర్తి చేసింది. గత వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యం స్థానంలో వచ్చే నెల ఒకటి నుంచి నాణ్యమైన మద్యం విక్రయించడానికి ఏర్పాట్లు చేస్తోంది. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లకు సంబంధించి అమలు ఎప్పుడు జరుగుతుందోననే చర్చ ప్రజల్లో జరుగుతో ంది.వీటి అమలుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.జిల్లాలో రబీ ధాన్యం బకాయిలన్నీ చెల్లించారు. గత ప్రభుత్వం పేదల కాలనీ పేరిట మొదలెట్టి వదిలేసిన కాలనీల్లో కొంతభాగం పెండింగ్‌లో ఉన్న సుమారు 4 వేల ఇళ్లను 100 రోజుల్లో పూర్తి చేసే లక్ష్యం పెట్టుకున్నారు. ఉచిత ఇసుక అమల్లోకి తెచ్చారు. రేపో మాపో పూర్తి స్థాయిలో ఇసుక అమలులోకి రానుంది. రాజమ హేంద్రవరంలోని మో రంపూడి ఫ్లయ్ వోవర్‌ను పూర్తి చేశారు.

ఆకలి తీరుస్తున్నారు..

పేదోడి ఆకలి తీర్చడానికి కూటమి ప్రభుత్వం ఆగస్టులో అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. ఐదేళ్ల పాటు జగన్ ప్రభుత్వం వీటికి గ్రహణం పట్టించింది. అధికారంలోకి రాగానే అప్పటి వైసీపీ సర్కారు అన్న క్యాంటీన్లను మూసేసింది. కూటమి రాగానే జిల్లాలో మొత్తం ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేసింది. మలి విడతలో త్వరలో మరో కొన్ని ప్రారంభించనుంది. రాజమహేంద్రవరంలో 3, కొవ్వూరులో 1, నిడదవోలులో ఒకటి ఏర్పాటు చేసి రూ.15కే టిఫిన్, మధ్యాహ్నం,రాత్రి భోజనం పెడుతున్నారు. దీనివల్ల వందలాది మంది పేదల కడుపు నిండుతోంది.

గోదావరి నీళ్లిస్తాం



వందరోజుల పాలనలో ప్రజల అభిమానం పొందాం. వచ్చే ఐదేళ్లలో అనేక పనులకు ప్రతిపాదనలు చేశాం. మునిసిపాలిటీకి రూ.58 కోట్లు,రూరల్‌లో రూ.96 కోట్లతో గోదారి నీటి సరఫరాకు ప్రతిపాదనలు చేశాం.

- ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు

3500 వినతుల పరిష్కారం



ప్రజల నుంచి జనవాణికి 3,800 వినతులు రాగా 3500 పరిష్కరించాం. శుక్ర వా రం సీతానగరం మండ లం ఇనుగంటివారిపేట, రామచంద్రాపురం గ్రామాల్లో ఇది మంచి ప్రభు త్వం కార్యక్రమం నిర్వహిస్తాం.

- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం

ప్రజల్లో నమ్మకం ఏర్పడింది..



వందరోజుల పాలన ప్రజల్లో మంచి నమ్మకాన్ని కలిగించింది. ప్రజల సంక్షేమ,అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాం. ఇటీవల నియోజకవర్గంలో జరిగిన 85 గ్రామ సభల్లో తీర్మానాలు తీసుకున్నాం.

- మద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం

ప్రజల మన్ననలు పొందాం



ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 100 రోజులు పూర్తి చేసుకుని ప్రజల మన్ననలు పొందాం.. అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తున్నాం. జిల్లాలో ఎమ్మెల్యేలు సూచించిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.269.64 కోట్లు శాంక్షన్ చేయించా. రాజమండ్రిలోని అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో మెడికల్ కాలేజీకి 2024 -25కి 23 పీజీ సీట్లకు అనుమతి తెచ్చాం.

- దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు



పర్యాటక అభివృద్ధిపై దృష్టి : మంత్రి దుర్గేష్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండేలా చేశాం. జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాం. కడియం నుంచి అడుగులు పడతాయి. నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా అక్కడ అభివృద్ధికి పాటుపడుతున్నా.

రూ.350 కోట్ల అభివృద్ధి పనులు ప్రతిపాదించాం



కూటమి వంద రోజుల పాలనలో ప్రజలకు ప్రశాంత వాతావరణంకల్పించాం.నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపా యాల కల్పనకు రూ.350 కోట్లతో పనులు ప్రతిపాదించాం. కడియం నర్సరీలు టూరిజం హబ్‌గా చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఆవ కాలువ ఆక్రమణలు తొలగించి ముంపు లేకుండా చేశాం.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే

మీ భద్రత- మా బాధ్యతగా తీసుకున్నా..



వందరోజుల కూటమి ప్రభుత్వం పాలనలో రాజమహేంద్రవరం సిటీ లో ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేశాం.మీ భద్రత- మా బాధ్యత పేరుతో డివిజన్ల వారీ సమావేశాలు పెట్టి ప్రజల్లో చైతన్యం కలిగిం చాం.గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు అరికట్టాం.అనేక అభివృద్ధి పనులతో ప్రజల్లో ఉన్నాం. **- ఆదిరెడ్డి వాసు, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే**

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నా..



నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నా.వేమగిరి సామర్లకోట రహదారిని నేషనల్ హైవేగా మార్పుచేసేలా సీఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి గడ్కరీకి లేఖ రాయించా.కెనాల్ రోడ్డు తక్షణ మరమ్మతు లకు రూ.6.33 కోట్ల నిధులు మంజూరు చేయించా. రంగంపేట మండలంలో రూ.6.50 కోట్ల నిధులతో రెండు రోడ్ల నిర్మాణం. ఏడు దేవాలయాల అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించా. **- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే అనపర్తి**

జీజీహెచ్‌లో శిశుమరణంపై త్రీమెన్ కమిటీ విచారణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 19 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఇటీవల జరిగిన శిశు మరణంపై గురువారం త్రీ మెన్ కమిటీ విచారణ జరిపింది. కమిటీ సభ్యులు డాక్టర్ హేమంతి, డాక్టర్ మోహన్‌చంద్ర, డాక్టర్ కుమార్ ఈ విచారణ నిర్వహించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి తల్లిదండ్రులు మాట్లాడుతూ తల్లీ బిడ్డల వార్డులో ఈనెల 4వ తేదీన తమ కుమార్తెను డెలివరీ కోసం చేర్పించామని, అయితే సాయంత్రం వరకూ వైద్యులు పట్టించుకోకపోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగిందని తెలిపారు. దీన్ని తాము వైద్యుల దృష్టికి తీసుకువెళ్లగా ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేశారని, కానీ పుట్టిన బాబు చనిపోయాడని చెప్పడంతో షాక్‌కు గురయ్యామని తెలిపారు. వైద్యులు కాలయాపన చేయడం వల్లే తల్లికి, తమకు అన్యాయం జరిగిందని వివరించారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని కమిటీ సభ్యులు వారికి తెలిపారు. గర్భిణీ వాసవి దత్తసాయి తరపున ఆమె తల్లిదండ్రులు ఈశ్వరరావు, కవిత ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభకు, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఇటీవల వినతిపత్రాలు అందజేశారు.

వినాయక విగ్రహం వేలం

దేవరపల్లి, సెప్టెంబరు 19: దేవరపల్లిలో మెరకవీధి వినాయక విగ్రహం పాట రూ.లక్షా 65వేలకు దేవరపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కైరం అప్పారావు పాడుకున్నారు. ఆలయం వద్ద గురువారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహ వేలం నిర్వహించారు. పాటలో కైరం అప్పారావు పాడుకున్నారు. దేవరపల్లి ఆలయం వద్ద 42 ఏళ్లగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అత్యధికంగా రూ.లక్షా 65 వేలకు పాట వెళ్లడంతో అర్చకులు, గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

నాలుగు ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి

మంత్రి కందుల దుర్గేష్



రేలంగి విగ్రహావిష్కరణలో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందీశ్వరి, ఎమ్మెల్యేలు వాసు, బత్తుల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27న పర్యాటక రంగానికి సంబంధించిన 38 విభాగాల్లో అవార్డులను అర్హులకు సీఎంచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదగా ప్రదానం చేయనున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెంట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్టిమెంట్ (శాసి) పథకం కింద నాలుగు ప్రాంతాల్లో ఐకానిక్ టూరిజం హబ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించామన్నారు. కేంద్రం టూరిజం మంత్రి ఇప్పటికే రూ.250 కోట్లు కేటాయించారని.. కాని తాము సుమారు రూ.400కోట్లు అడుగుతున్నామన్నారు. ఒకటి శ్రీశైలంలో టెంపుల్ టూరిజంతో పాటు టైగర్ రిజర్వుడు ఏరియా, వాటర్‌ఫాల్స్ ప్రాంతాలను కలుపుకుని అభివృద్ధి చేస్తామన్నారు.రెండోది గోదావరి జిల్లాల్లోని ప్రాంతాలన్నీ కలుపుకుని అఖండ గోదావరి ప్రాజెక్టు, మూడోది బాపట్ల బీచ్ కారిడార్, సూర్యలంకలో రిసార్ట్స్ నిర్మిస్తామని, నాల్గోది నంద్యాలలోని సంగమేశ్వరంను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు.వాటి డీపీఆర్‌లతో కేంద్రానికి అక్టోబరు 15న రిపోర్టు ఇస్తామన్నారు. వచ్చే ఏడాదికి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఒక్కో ప్రాజెక్టుకు కనీసం రూ.100 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఎకో టూరిజానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో శాసి, ప్రసాద్, స్వదేశీ దర్శన్ స్కీమ్‌ల కింద టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. తిరుపతి, గండికోటలలో ఒబెరాయ్ సంస్థ టూరిజం అభివృద్ధి చేస్తుందని,ఎడ్వంచర్ టూరిజంలో భాగంగా స్వదేశీ దర్శనం కింద అరకు ,లంబసింగి, బొర్రా గుహలను పర్యాటకంగా తీర్చిదిద్దనున్నామన్నారు.రాజధాని అమరావతిలో మెగా టూరిజం హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు.ప్రసాద్ (పిల్‌గ్రిమేజ్ రిజువనేషన్ అండ్ స్పిరుచ్చువల్ హెరిటేజ్ అగ్రిమెంటేషన్ డ్రైవ్) స్కీమ్ కింద అన్నవరం పుణ్యక్షేత్రాన్ని రూ. 25.32 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.ఏపీ టూరిజంశాఖతో కలసి పనిచేయడానికి వియత్నాం నుంచి శుక్రవారం ప్రతినిధులు రానున్నట్టు తెలిపారు. ఆంధ్రలో స్టూడియోలు నిర్మించడానికి ముందుకు వస్తే ప్రభుత్వ తరపున సహకారం అందిస్తామని తెలిపారు. సినిమా షూటింగ్‌లకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తామని చెప్పారు. సమావేశంలో రాజమండ్రి సిటీ జనసేన్ ఇన్‌చార్జి, అనుశ్రీ సత్యనారాయణ,టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేలంగి విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ,సెప్టెంబరు 19: సమయస్ఫూర్తితో హాస్యం పండించడంలో దిట్ట హాస్య నటుడు రేలంగి వెంకట్రామయ్య అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.రాజమహేంద్రవరం గోదావరి బండ్ గౌతమి నందనవనంలో రాజమండ్రి గౌడ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాస్యనట చక్రవర్తి రేలంగి వెంకట్రామయ్య నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు.రేలంగికి ముందు తర్వాత ఎందరో నటులు వచ్చినప్పటికి రేలంగి ఉచ్చారణ,హావభావాలు మరెవరికి రాలేదన్నారు. పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి హాస్యనటుడు రేలంగి అని కొనియాడారు. ఎంపి పురందేశ్వరి మాట్లాడుతూ రేలంగి విగ్రహావిష్కరణలో పాల్గొన ఈ రోజు మరువురానిదన్నారు. తన తండ్రి ఎన్‌టీఆర్‌కి రేలంగికి అవినాభావ సంబంధం ఉందన్నారు. ఎన్‌టీఆర్ రేలంగి బావ అని ఆప్యాయంగా పిలిచేవారన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయిన హాస్యనటుడు రేలంగి అన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గొప్ప హాస్యనటుడు రేలంగి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ రేలంగి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని గౌడశెట్టిబలిజి సంఘం నాయకులు వచ్చి కలిసినప్పుడు చాలా ఆనందపడ్డానన్నారు.





గుమిగూడిన ఆందోళనకారులు.. పోలీస్ బలగాలతో ఎస్పీ నరసింహకిశోర్..దాడిలో ధ్వంసమైన స్కూటర్



వినాయకుడి శోభాయాత్రపై రాళ్లదాడి

రెండు వర్గాల మధ్య ఘర్షణ.. కొవ్వూరులో ఉద్రిక్తత

కొవ్వూరు, సెప్టెంబర్ 19 : కొవ్వూరు పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మూడురోజుల కిందట పట్టణ రాజీవ్‌కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఊరేగింపు సమయంలో రాజీవ్‌కాలనీ, తునిపేటకు చెందిన రెండువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రాజీవ్‌కాలనీ నుంచి గురువారం మరో వినాయక విగ్రహం నిమజ్జనానికి శోభాయాత్రగా బయలుదేరింది.రాజీవ్‌కాలనీ నుంచి శ్రీరామకాలనీ మీదుగా వినాయకుడి శోభాయాత్ర దొమ్మేరు, కొవ్వూరు రాష్ట్ర రహదారికి వచ్చే దారిలో కొంతమంది అల్లరిమూకలు దారికాచి రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో రాజీవ్‌కాలనీకి చెందిన చొక్కా నందకిశోర్ తలకు గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కుట్లు పడ్డాయి. నందకిశోర్‌తో పాటు మరి కొంతమందికి గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరికి స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డు పక్కన పార్క్‌చేసిన పలకంశెట్టి సురేష్ స్కూటర్‌ను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. పురపాలక సంఘానికి చెందిన ఇంటింటా చెత్త సేకరించే వాహనాన్ని ధ్వంసం చేశారు. రెండువర్గాలు ఒకరిపై ఒకరు విచక్షణారహితంగా రాళ్లు, కర్రలు విసురుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ బి. నరసింహకిశోర్ అదనపు బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా పరిధిలోని పోలీసు యంత్రాంగాన్ని కొవ్వూరు రప్పించి ఆందోళనకారులను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. గురువారం రాత్రి పట్టణమంతా పోలీసులు భారీగా మోహరించారు.పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేశారు.

అది అడవి పిల్లి

- శ్రీరాంపురం సమీపంలో ట్రాప్ కెమెరాలో గుర్తించాం
- చిరుత పులిని పట్టుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు: ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 19: తూర్పు గోదావరి జిల్లా దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోని శ్రీరాంపురం గ్రామ సమీపంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో బుధవారం రాత్రి అడవిపిల్లిని గుర్తించామని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరుత పులి, అడవి పిల్లి పాదముద్రల్లో చాలా తేడాలుంటాయని ఆమె వివరించారు. అడవిపిల్లి పాదముద్రలు పరిమాణంలో చిరుత పులి పాదముద్రల కంటే చిన్నవిగా ఉంటాయన్నారు. బుధవారం రాత్రి శ్రీరాంపురం, గురువారం కోలమూరుల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు తమకు సమాచారం అందిందన్నారు. దీంతో నిపుణులు వెళ్లి పాదముద్రలను గమనించి... అవి అడవిపిల్లి పాదముద్రలుగా నిర్ధారించారన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాప్ కెమెరాల స్థానం మార్చామన్నారు. అదనపు ట్రాప్ కెమెరాలను అమర్చి మొత్తం 100 ట్రాప్ కెమెరాలను ఉపయోగిస్తున్నామన్నారు. చిరుతపులిని పట్టుకునేందుకు ఏడు బోనులు అమర్చి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు నిర్ధారణ కాలేద న్నారు. అటవీ శాఖకు అందరూ సహకరించాలని కోరారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. నకిలీ సందేశాలకు పాల్పడిన వారిపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.


ట్రాప్ కెమెరాలో గుర్తించిన అడవి పిల్లి


హుండీల్లో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

శృంగారవల్లభ స్వామి హుండీల ఆదాయం

రూ.19.31 లక్షలు

పెద్దాపురం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో గురు వారం తెరిచి లెక్కించారు. 79 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.13,12,116, అన్నదాన హుండీల ద్వారా రూ.6,19,580... మొత్తం రూ.19,31,696 ఆదాయం వచ్చిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. లెక్కింపులో మరిడమ్మ దేవస్థానం సహాయ కమిషనరు చేబ్రోలు రామ్మోహనరావు, దేవదాయ శాఖ ప్రాంతీయ తనిఖీదారు సీహెచ్ ఉదయ్‌బాబు నాయుడు, తిరుపతి గ్రామ సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు మాధురీప్రకాష్‌లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వేద విద్యనభ్యసించిన నిరుద్యోగ యువతకు భృతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వేద విద్యలో ఉత్తీర్ణత పొంది నిరుద్యోగులుగా ఉన్న వారు నెలకు రూ.3వేలు భృతి పొందేందుకు అర్హులు. ఆసక్తి గల నిరుద్యోగ వేద పండితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా దేవదాయ శాఖ అధికారి వి.సోమరాజు తెలిపారు. వేద విద్య సర్టిఫికెట్ నకలు, ఆధార్ నకలు, ఏ విధమైన ఉద్యోగం లేదని స్వీయ ధ్రువపత్రం దరఖాస్తుకు జత చేసి రాజమహేంద్రవరంలోని జిల్లా దేవదాయ శాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు అందించాలని సూచించారు. మరింత సమాచారం కోసం 0883-2478375 నెంబరును సంప్రదించాలని కోరారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మృధు హాసిని

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు

గిరిజన విద్యార్థుల ఎంపిక

అడ్డతీగల, సెప్టెంబరు 19: మండలంలోని వేటమామిడి హోసన్నా పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మృధుహాసిని తెలిపారు. కాకినాడలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అభిషేక్, కునేటి శ్రీను, చెదల విజయ్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీ సుందర్‌ను డీన్ ధనసుందర్ అభినందించారు.

పేకాడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగులు

ఇద్దరికి షోకాజ్ నోటీసు

అన్నవరం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా తుని రూరల్ పరిధిలో నాలుగు రోజుల క్రితం పేకాడుతూ పట్టుబడ్డ అన్నవరం దేవస్థానం ఉద్యోగులు ఇద్దరికి ఈవో రామచంద్రమోహన్ గురువారం షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దేవస్థానం ఏఈవో కొండలరావు, సూపరింటెండెంట్ ఐవీ రామారావు గత ఆదివారం కొందరు వ్యక్తులతో కలిసి పేకాడుతూ దొరికిపోగా రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దేవస్థానం ప్రతిష్ట మసకబారేలా వ్యవహరించిన వారిద్దరిపై చర్యలు తీసుకుంటూ ఏడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఈవో కోరారు.

డీఈవో ధ్రువీకరణ లేని దరఖాస్తుల తిరస్కరణ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 19: ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసిన వాటిలో జిల్లా విద్యాశాఖాధికారి ధ్రువీకరణ లేని వాటిని తిరస్కరిస్తున్నట్టు కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్ తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఇప్పటివరకు 14,191 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఓటుకోసం దరఖాస్తు చేసుకున్న వాటిలో కొన్నింటిపై ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరణ చేశారన్నారు. వాటిని తిరస్కరిస్తున్నామని చెప్పారు.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ మధ్య వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 19: రానున్న పండుగ రోజులను పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని నియంత్రించేందుకు, వారికి మరింత మెరుగైన ప్రయాణ సదుపాయాలు కల్పించేందుకు తిరుపతి-శ్రీకాకుళం రోడ్-తిరుపతి మధ్య సెప్టెంబరు, నవంబరు నెలల్లో వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిరుపతి-శ్రీకాకుళం రోడ్ (07442) తిరుపతిలో ప్రతి ఆదివారం సాయంత్రం 5.10 గంటలకు బయల్దేరి రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు మీదుగా అర్ధరాత్రి 2.02 గంటలకు రాజమహేంద్రవరం, అర్ధరాత్రి 2.57 గంటలకు సామర్లకోట, తెల్లవారుజామున నాలుగు గంటలకు తుని... అక్కడి నుంచి అనకాపల్లి, దువ్వాడ, సింహాచలం, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా సోమవారం మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 20, 27, నవంబరు 3, 10 తేదీల్లో ప్రతి ఆదివారం బయల్దేరుతుంది.

శ్రీకాకుళం రోడ్-తిరుపతి (07443) ప్రతి సోమవారం సాయంత్రం మూడు గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరుతుంది. చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, సింహాచలం, దువ్వాడ, అనకాపల్లి మీదుగా రాత్రి 8.22 గంటలకి తుని, రాత్రి 8.58 గంటలకి సామర్లకోట, 9.45 గంటలకి రాజమహేంద్రవరం ... అక్కడి నుంచి ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట మీదుగా మంగళవారం ఉదయం 8.20 గంటలకి తిరుపతి చేరుతుంది. ఈ రైలు సెప్టెంబరు 21, 28, నవంబరు 4, 11 తేదీల్లో ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్‌లో బయల్దేరుతుంది. సెకండ్ ఏసీ-1, థర్డ్ ఏసీ-2, స్లీపర్-13, జనరల్-6, ఎస్ఎల్ఆర్-2 వెరసి 24 బోగీలతో ఈ రైలు రెండువైపులా రాకపోకలు సాగిస్తుంది. ప్రయాణికులు ఆయా స్టేషన్లలో బుకింగ్ కార్యాలయాల వద్ద రిజర్వేషన్ టిక్కెట్లు పొందవచ్చని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన ప్రకటనలో తెలిపారు.


రాజమహేంద్రవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పురందేశ్వరి

పుష్కరాల నాటికి ఈస్ట్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

- రూ.280 కోట్లతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ ఆధునికీకరణ
- రాజమహేంద్రవరం పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక

ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 19: వచ్చే గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరం ఈస్ట్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తామని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ రూ.280 కోట్లతో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు చేపట్టడానికి కేంద్రానికి డీపీఆర్ పంపినట్టు చెప్పారు. రైల్వే అధికారులు ముందుగా రూ.240 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశారని, భవిష్యత్ అవసరాలు, పార్కింగ్, ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాల కోసం అదనంగా మరో రూ.40 కోట్లు పెంచి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రధానంగా ఈస్ట్ రైల్వేస్టేషన్ వైపు ఎక్కువగా అభివృద్ధి చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. అలాగే రాజమహేంద్రవరం పట్టణ ముఖచిత్రాన్ని మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాల్సి ఉందన్నారు. ట్రాఫిక్ చక్కదిద్దడం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, మురుగునీటి మళ్లింపు, ఇతర అభివృద్ధి పనుల కోసం సమగ్ర సర్వే జరిపి, దానికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టనున్నట్టు చెప్పారు. మధురపూడి విమానాశ్రయం నూతన టెర్మినల్ త్వరలోనే ప్రారంభమవుతుంద పురందేశ్వరి చెప్పారు. రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీ, అయోధ్య, జైపూర్‌లకు విమానాలు నడపాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రిని కోరామన్నారు. వరద బాధితులను మంచి ప్యాకేజీతో రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు బొమ్ముల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

9,718 కిలోల

రేషన్ బియ్యం పట్టివేత

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వాహన తనిఖీల్లో భాగంగా విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారులతో కూడిన బృందం గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రధాన తపాలా కార్యాలయం సమీపంలో ఓ వ్యాన్‌ను పరిశీలించింది. 198 బస్తాల్లో సుమారు 9,718 కిలోల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన వాహన యజమాని పడాల నాగ సూర్యనారాయణ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అనపర్తి ప్రాంతంలోని కోళ్ల ఫారాలకు తీసుకెళ్లమన్నట్టు అదే ఊరికి చెందిన వాహన డ్రైవరు ఊట దుర్గాప్రసాద్ చెప్పాడు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ రూ.26 లక్షలు ఉంటుంది. వ్యాన్ యజమాని, డ్రైవర్‌లపై కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు నాగవెంకటరాజు, నవీన్‌కుమార్, వలీ, వీరబాబు, సీఎస్‌డీటీ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతర నిఘా కొనసాగుతోందని.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ ఎస్పీ హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ నిల్వ, రవాణాపై సమాచారం ఉంటే 8008203261 నెంబరుకి సమాచారం ఇవ్వాలని కోరారు. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

ఆంధ్రావాసి అమెరికాలో మృతి


రమేష్ (పాత చిత్రం)

నల్లజర్ల, సెప్టెంబరు 19: తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన ముత్తిన రమేష్ (40) అమెరికాలో మృతి చెందాడు. అతని సోదరుడు నరేష్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... రమేష్ అమెరికాలోని ఇల్‌నాయిస్ రాష్ట్రం కార్‌బోనలే సిటీలోని సదరన్ ఇల్‌నాయిస్ యూనివర్సిటీలో ఎంఎస్ చదవడానికి 2022లో వెళ్లాడు. ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూనే చదువుకుంటున్నాడు. అక్కడి యువతితో రెండేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెతో విభేదించి రమేష్ వేరుగా ఉంటున్నాడు. ఆదివారం రాత్రి బయటకు వెళ్లి భోజనం చేసి వచ్చి రూమ్‌లో పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పారు. సోమ, మంగళవారాల్లో రమేష్ ఆచూకీ లేకపోవడం, అతడి గది నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతి చెంది ఉన్నాడని, మృతదేహం పాడై ఉందని వివరించారు. అక్కడి పోలీసులే బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గుండెపోటు లేదా బ్రెయిన్ హెమరేజ్‌తో మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఇండియా తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. మృతుడికి తల్లి పండమ్మ, సోదరులు నాని, నరేష్ ఉన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం



నిడదవోలు, సెప్టెంబరు 19: తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు రైల్వే స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటుచేస్తున్న 5వ నెంబరు ప్లాట్‌ఫామ్ సమీపంలో గురువారం సాయంత్రం సుమారు 60 సంవత్సరాల గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్టు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. సదరు వ్యక్తి అనారోగ్య పరిస్థితుల వల్ల కానీ, ఇతర కారణాల వల్ల కానీ సహజ మరణం సంభవించి ఉంటుందని ఆయన తెలిపారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు కాటన్ లుంగీ, కాషాయ రంగు టవల్, మెడలో చిన్న రుద్రాక్షమాల, జంధ్యం ఉన్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుని గుర్తించిన వారు 7013360296, 9948010061 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

డెంగీతో చిన్నారి మృతి



శంఖవరం, సెప్టెంబరు 19: కాకినాడ జిల్లా శంఖవరం గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి ఎమ్మిలి వనజ వారం నుంచీ తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. నాలుగు రోజుల క్రితం రౌతులపూడి సీహెచ్‌సీకి తరలించగా అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో గురువారం సాయంత్రం బాలిక మృతి చెందిందని వైద్యులు చెప్పారు.

పాఠశాలల్లో నాడు-నేడు పనుల పూర్తికి రూ.1,400 కోట్లు అవసరం

- పనుల నిర్వహణలో లోపాలు ఉన్నాయి
- సెంట్రల్ మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్‌కు రూ.97కోట్లు బిల్లుల పెండింగ్
- విద్యా శాఖ అకడమిక్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు



గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 19: రాష్ట్రంలోని పాఠశాలల్లో నాడు-నేడు పనుల పూర్తికి మరో రూ.1,400 కోట్లు అవసరమవుతాయని విద్యా శాఖ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అకడమిక్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు వెల్లడించారు. గత ప్రభుత్వం సెంట్రల్ మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్‌కు రూ.97కోట్లు బిల్లులను పెండింగులో ఉంచిందని చెప్పారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరం, చేబ్రోలు రథంబాట మండల పరిషత్ పాఠశాల, దుర్గాడ, చేబ్రోలు, గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలు, ఎంపీఆర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, కొడవలి పాఠశాలల్లో పనులను ఆయన గురువారం తనిఖీ చేశారు. మండలంలోని ఎ.విజయనగరంతో పాటు ఐదు పాఠశాలల్లో పనుల నిర్వహణపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 'నాడు-నేడు' కింద జరిగిన పనుల్లో 44 పాఠశాలల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లోపాలు గుర్తించామని చెప్పారు. పాఠశాలల తరగతి గదులకు అవసరమైన కిటికీలు, తలుపులు తదితర పనులను అప్పటి నిర్వాహకులు పూర్తి చేయలేదని తనిఖీల్లో వెల్లడైందన్నారు. డిసెంబరు నాటికి అన్ని పనులు పూర్తి చేయాల్సి ఉందని చెప్పారు. పాఠశాలల్లో 'నాడు-నేడు' కింద మిగిలిన పనులను పూర్తి చేసేందుకు కొత్త విద్యా కమిటీలతో బ్యాంకు ఖాతాలు లింక్ చేయాలని ఆదేశించామన్నారు. 20-30 రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. పర్యటనలో గొల్లప్రోలు ఎంఈవో-2 శివప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గౌతు వెంకటరమణ పాల్గొన్నారు.


ఎ.విజయనగరంలో నాడు-నేడు పనులపై ఆరా తీస్తున్న నాగేశ్వరరావు

'అభయ హస్తం' లబ్ధిదారులకు రిక్తహస్తం

పింఛన్లపై అధికారుల తీరుకు టీడీపీ నేత నిరసన ... వెలుగు కార్యాలయానికి తాళం

అనపర్తి, సెప్టెంబరు 19: వృద్ధులకు న్యాయం చేయలేని కార్యాలయాలు ఎందుకు ఉన్నట్టు? ప్రభుత్వం జీతాలు ఎందుకిస్తోందంటూ టీడీపీ తూర్పు గోదావరి జిల్లా అధికార ప్రతినిధి, కొప్పవరం మాజీ సర్పంచ్ కర్రి వెంకట రామారెడ్డి అనపర్తిలోని వెలుగు కార్యాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన కార్యాలయానికి తాళాలు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరామారెడ్డి మీడియాతో మాట్లాడుతూ 2009లో అప్పటి ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళలతో సొమ్ములు కట్టించుకుని వారికి 60 ఏళ్లు పూర్తయిన తర్వాత 'అభయహస్తం' పేరుతో నెలకు రూ.500 పింఛను ఇవ్వాలని పథకం రూపొందించిందన్నారు. గత ప్రభుత్వం అభయహస్తం పింఛన్లపై దృష్టి సారించకపోవడంతో అనేక మంది అర్హులు పింఛను అందుకోలేకపోయారన్నారు. అప్పట్లో వీరంతా వెలుగు కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. జిల్లావ్యాప్తంగా సొమ్ము చెల్లించి పింఛన్లు అందక అనేక మంది వృద్ధులు ఇబ్బందిపడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొప్పవరం గ్రామంలో అర్హులైన ఐదుగురిని గుర్తించి పింఛను పునరుద్ధరించాలని కోరానన్నారు. నెల క్రితం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించిన వెలుగు అధికారుల సమావేశంలో కూడా నియోజకవర్గంలో వెలుగు పథకం ద్వారా అర్హులై పింఛను రాని వారి జాబితాను రూపొందించాలని కోరినప్పటికీ నేటికీ పట్టించుకోలేదన్నారు. పింఛను మంజూరు చేయకపోతే వారు ఏడాదికి రూ.385 చొప్పున చెల్లించిన సొమ్ములైనా వెనుకకు ఇప్పించాలని కోరినప్పటికీ అదీ జరగలేదన్నారు. ఈ విషయమై అధికారులను ఎన్నిసార్లు ప్రశ్నించినా పొంతన లేని సమాధానాలు చెప్తున్నారన్నారు. గురువారం దీనిపై ప్రశ్నించేందుకు వెలుగు కార్యాలయానికి వెళ్లగా... ఏపీఎం సెలవులో ఉన్నారని తమకేమీ తెలియదని సిబ్బంది చెప్పారన్నారు. అందుకే కోపంతో కార్యాలయానికి తాళాలు వేశానని చెప్పారు.


వెలుగు కార్యాలయానికి తాళం వేస్తున్న మాజీ సర్పంచ్ వెంకట రామారెడ్డి


కంటైనర్‌లో తరలిస్తున్న ఎద్దులు

53 ఎద్దులు ఒక కంటైనర్‌లో...

అక్రమంగా తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న కొవ్వూరు పోలీసులు

కొవ్వూరు, సెప్టెంబరు 19: సరైన ఆహారం, నీరు అందించకుండా అక్రమంగా తరలిస్తున్న పశువుల కంటైనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... పాయకరావుపేట సంత నుంచి 53 ఎద్దులను తమిళనాడుకు చెందిన కంటైనర్‌లో హనుమాన్ జంక్షన్ తరలిస్తుండగా కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద విశ్వహిందూపరిషత్ సభ్యులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం, పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని కంటైనర్‌తో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పశువులను గోకవరం గోశాలకు తరలిస్తున్నట్టు సీఐ విశ్వ చెప్పారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

30.680 కిలోలు స్వాధీనం

గోకవరం, సెప్టెంబరు 19: గంజాయి కలిగి వున్న ఇద్దరు మైనర్ల (మహిళలు)ను గురువారం అరెస్టు చేసినట్టు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తూర్పు గోదావరి జిల్లా గోకవరం ఆర్టీసీ డిపో సమీపంలోని బమ్మెర పోతన విగ్రహం వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా రెండు సంచుల్లో రూ.1,53,400 విలువైన 30.680 కిలోల గంజాయిని గుర్తించారు. ఒక సెల్‌ఫోన్, రూ.1,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. మైనర్లను ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన వారిగా గుర్తించి జువనైల్ హోమ్‌కి తరలించినట్టు ఎస్ఐ చెప్పారు.

ఏజెన్సీ సమాచారం


రాజవొమ్మంగి పీహెచ్‌సీకి వైద్యం కోసం వచ్చిన రోగులు

సిబ్బంది కొరత... రోగుల ఇక్కట్లు

రాజవొమ్మంగి, సెప్టెంబరు 19: జీవో నెం.85 రద్దు చేయలంటూ రాష్ట్ర వ్యాప్తంగా వైద్యులు విధులకు హాజరవ్వకుండా నిరసన తెలుపుతున్న విషయం తెలిసిందే. అయితే ఏజెన్సీ ఆసుపత్రుల్లో వైద్యులు ఉండక, ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక ఫీజులు ఇచ్చి వైద్యం చేయించుకోలేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రులు గురువారం రోగులతో కిక్కిరిసాయి. రాజవొమ్మంగి పీహెచ్‌సీకి రోగులు ఎక్కువ సంఖ్యలో వచ్చారు. స్టాఫ్ నర్సు ఒక్కరే ఓపీ రాయడం, రోగులను చూడడం, ఇంజక్షన్లు చేయడం, మందులు ఇవ్వడం జరిగింది. స్టాఫ్ నర్సులు మెరుగైన వైద్యం అందించినా సిబ్బంది కొరతతో వారు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, వైద్యానికి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోయారు. రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందంటూ ప్రజాప్రతినిధులు, మండల అధికారులు ఉన్నతాధికారులకు నివేదించినా చర్యలు చేపట్టలేదు.


కొందరు క్యూలో నిలుచోగా... మరికొందరు పక్కన కూర్చున్న దృశ్యం

గణనాథుల నిమజ్జనం



మోతుగూడెం, సెప్టెంబరు 19: స్థానిక జగదాంబ సెంటర్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 11 రోజుల పాటు గణేశ ఉత్స వాలు నిర్వహించారు. గురువారం యువతీ, యువకులు డప్పులు, నృత్యాలు, విన్యాసాలతో గణనాథుని ఊరేగించి సీలేరు నదిలో నిమజ్జనం చేశారు. జగదాంబ సెంటరు ఉత్సవ కమిటీ సభ్యులు హేమంత్ భీమరాజు, సాయి, రాంప్రసాద్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



వీఆర్ పురం: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు తొమ్మిది రోజులు విశేష పూజలు జరి పారు. వీఆర్‌పురం ఇందిరా సెంట ర్లోని స్వామివారి ఆలయంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని, హైస్కూల్ రోడ్డులోను, గోల్డ్‌షాప్ జగదీష్ వీధిలో ఏర్పాటుచేసిన గణనాథులను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగించారు. అనంతరం గోదావరిలో నిమజ్జనంచేశారు. ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గంగానమ్మ జాతర



కూనవరం, సెప్టెంబరు 19: ప్రతి రెండేళ్లకోసారి జరిగే గంగానమ్మ జాతర గురువారం అట్టహాసంగా జరిగింది. శివపార్వతులను చిన్న పడవలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం గంగానమ్మకు, ముత్యాలమ్మకు మేకపోతు బలిచ్చారు. ఊరేగించిన చిన్న పడవను గోదావరిలో వదిలి పూజలు చేశారు. గంగానమ్మ జాతర జరిగే వారం ముందు వరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరు.

ఇందుకూరు రోడ్డుకు మోక్షం



దేవీపట్నం, సెప్టెంబరు 19: మండలంలోని ఇందుకూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ-1 రోడ్డు కంకర లేచిపోవడంతో గ్రామస్తులు ప్రయాణానికి చాలా ఇబ్బందిపడేవారు. ఈ విషయాన్ని స్థానికులు దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె రోడ్డు నిర్మాణానికి పంచాయతీ తరపున తీర్మానం చేసి అధికారులకు పంపారు. వారు స్పందించి ఇందుకూరు కృష్ణుని గుడి వద్ద నుంచి ఆర్‌అండ్ ఆర్ కాలనీ-1కి మెటల్ రోడ్డు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో పనులు మొదలుపెడతామన్నారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఓంకార్ ట్రస్టు ఆధ్వర్యంలో రహదారికి మరమ్మతులు



కూనవరం, సెప్టెంబరు 19: మండలంలోని బండారుగూడెం ప్రధాన రహదారి పాడైంది. ఈ విషయాన్ని స్థానిక గిరిజనులు ఓంకార్ ట్రస్టు చైర్మన్ బాల స్వామి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణం స్పందించిన ఆయన వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో చిత్తడి రాజేష్, సోమరాజు, మహేంద్ర పాల్గొన్నారు.

పడాల వీరభద్రరావు మృతికి సంతాపం




అడ్డతీగల, సెప్టెంబరు 19: అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ వ్యవస్థాపకుడు పడాల వీరభద్రరావు మృతికి అడ్డతీగల ఎస్ఐ అప్పలరాజు సంతాపం తెలిపారు. అడ్డతీగల పోలీస్ స్టేషన్ ఆవరణలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పడాల చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దంగేటి సత్తిబాబు, స్టార్ శ్రీను, చోడిశెట్టి సుబ్బారావు, సంఘ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'అర్హులకు మాత్రమే మినీ గోకులాలు మంజూరు చేయాలి'

దేవీపట్నం, సెప్టెంబరు 19: అర్హులైన అభ్యర్థులకు మాత్రమే మినీ గోకులాలు మంజూరు చేయాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. షెడ్యూల్డు ప్రాంతాల్లో పీసా చట్టం అమలులో ఉన్నందున పశు సంపద కలిగిన ఆదివాసీలకు మాత్రమే మంజూరు చేయాలన్నారు.

జైగౌడ సేన యువజన విభాగం అధ్యక్షుడిగా రాంబాబు



దేవీపట్నం, సెప్టెంబరు 19: జైగౌడ సేన యువజన విభాగం అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడిగా ఇందుకూరుపేటకు రేలంగి రాంబాబు గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మోర్ల ఏడుకొండలు గౌడ్ ఉత్తర్వులు ఇచ్చారు.

విద్యుత్ వైర్లు చోరీ

కూనవరం, సెప్టెంబరు 19: స్థానికంగా మూతపడిన భాస్కర థియేటర్‌ను కల్యాణ మండపంగా తీర్చిదిద్దుతున్నారు. ఇందులో భాగంగా నూతనంగా వైరింగ్ చేస్తున్నారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రూ.9వేలు విలువైన విద్యుత్ వైర్లను దొంగలించారు.

స్వచ్ఛాంధ్రకు కృషి చేయాలి

» జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
» పలుచోట్ల స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19: మహాత్మ గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన దేశ అభివృద్ధి లక్ష్య సాధనలో దేశ ప్రధాని స్ఫూర్తితో ప్రతి ఒక్కరం స్వచ్ఛాంధ్ర కోసం కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. గురువారం పలు చోట్ల స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞను అధికారులు, ఉద్యోగులతో జేసీ చేయించారు. ప్రతి ఏడాదిలో 100గంటలు, ప్రతి వారానికి కనీసం 2గంలు శ్రమదానం చేసి పరిశుభ్రత ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పానికి కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టూరిజం ఆర్డీ వి.స్వామినాయుడు, జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, సీపీవో ఎల్.అప్పలకొండ ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగులతో కమిషనర్ కేతన్ గార్గ్ స్వచ్ఛతా హీ సేవ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే సిబ్బంది ఉద్యోగ బాధ్యతలు నిర్వహించే ప్రదేశాలతో పాటు తాము నివసించే ప్రాంతాల్లోను పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రభుత్వం నిర్వహించనున్న కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ పీఎం సత్యవేణి, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, మునిసిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ వినూత్న, డీడీ రామారావు, ఈఈ మదర్షాఆలీ, మేనేజరు అబ్దుల్ మాలిక్, రెవెన్యూ అధికారులు పీహెచ్ శ్రీనివాసరావు, కేబీఆర్ రవికుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజానగరం: స్థానిక గైట్ కళాశాలలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ స్వచ్ఛతా హి సేవా ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలని, ఇంటి పరిసరాలను తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాల ప్రాంగణంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తొలగించి శుభ్రంచేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, పీడీ సీఎం హెన్రీ, ఎన్ఎస్ఎస్ పీవో బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్‌అండ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన దివాన్‌చెరువులో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్‌పీవో ఎస్.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలపై అవగాహన కలిగించారు. పరిసర ప్రాంతాల్లోని వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, ఇన్‌చార్జి హెచ్ఎం లావణ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు: గ్రామంలోని ప్రాచీన లక్ష్మీగణపతి ఆలయంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను నిర్వహించినట్టు ఈవో ఆకెళ్ల సత్యభాస్కర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని అన్నదాన భవనంపై వాటర్‌ట్యాంకులు, భవనంపై నీరు నిల్వ వుండకుండా శుభ్రం చేయించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రసాద్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట పీహెచ్‌సీలో సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్ఎస్ పి.రాజేశ్వరరావు, ఎంపీహెచ్ఏ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

సీతానగరం: సీతానగరం పీహెచ్‌సీ వద్ద సిబ్బంది స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములం అవుతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో యర్రా సుబ్బారాయుడు, సూపర్‌వైజర్ కె.సుధాకర్, నందీశ్వరరావు, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


సీతానగరం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న డాక్టర్లు, సిబ్బంది

ఉచిత వైద్యశిబిరం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19: రాజమహేంద్రవరం జయరాం థియేటర్ సెంటర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో గురువారం రాజమహేంద్రవరం మొబైల్ టెక్నీషియన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించి, నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను, ఆసూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ చిన్నరాముడు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి): జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో నిర్వ హించిన స్వచ్ఛతా హీ సేవలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని రాజమహేం ద్రవరం రెడ్‌క్రాస్ వలంటీర్ విద్యార్థినులు పాల్గొని పిచ్చి మొక్కలను, చెత్తా చె దారాన్ని తొలగించారు. శుచి, శుభ్రత అందరి బాధ్యతని నోడల్ అధికారి బోను రామకృష్ణ పేర్కొన్నారు. సొసైటీ ద్వారా అందించే సేవలను మేనేజింగ్ కమిటీ సభ్యురాలు ఆర్.మహాలక్ష్మీ వివరించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళా శాలలో ప్రిన్సిపాల్ ఎస్‌వీఎల్ నరసింహ ప్రతిజ్ఞ చేయించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 19: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అధికారులు, విద్యార్థులతో కలిసి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు మానవహారంగా ఏర్పడ్డారు. వీరితో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పరిసరాల పరిశుభ్రత మొక్కలు నాటడం పైనా ప్రజల్లో అవగాహన పెంపొందించాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, శివరామకృష్ణంరాజు తదితరులతో కలిసి పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మల్లిడి పార్వతి, సర్పంచ్‌లు వారా కుమారి, హేమతులసి, కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, మామిడిశెట్టి శ్రీను, మల్లిడి శ్రీనివాసరెడ్డి పలు శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానంపై అపోహలు వీడండి: ఎమ్మెల్యే నల్లమిల్లి


రక్తదాతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, సెప్టెంబరు 19: రక్తదానంపై ఉన్న అపోహలను వీడి ప్రతి ఒక్కరూ రక్త దానం చేసి ప్రాణ దాతలు కావాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మండలంలోని శ్రీదేవి ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రతిష్ఠను ప్రపంచ వ్యాప్తంగా పెంచిన నాయకుడని ప్రధాని నరేంద్రమోదీ అని, ఆయన నాయకత్వాన్ని బలపరచాలని అన్నారు. పక్షం రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థకు చెందిన వైద్యులు రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ కన్వీనర్ శివరామకృష్ణంరాజు, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు రమేష్, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి శివప్రసాద్, నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు హేమతులసి, గంగాభవాని పాల్గొన్నారు.

బాధిత యువకుడికి ఆర్థిక సాయం అందజేత

బిక్కవోలు, సెప్టెంబరు 19: తొస్సిపూడిలోని సాయితేజ రైసుమిల్లులో పనిచేస్తూ మూడు నెలల క్రితం ఇళ్లపల్లికి చెందిన అనుసూరి శ్రీకాంత్ ప్రమాదవశాత్తూ గాయపడ్డాడు. అయితే అప్పటి నుంచి అతని వైద్యానికి అయిన ఖర్చును మిల్లు వారే భరించారు. అయితే అతను ప్రస్తుతం ఏ పని చేయలేకపోవడంతో మిల్లు యాజమాన్యం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ద్వారా గురువారం రూ.4 లక్షలను శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు అందజేసింది. కార్యక్రమంలో నాయకులు తనుకు శ్రీధర్, పడాల వెంకటరామారెడ్డి, కన్నీరు రాఘవ, అనుసూరి సుబ్బారావు, కటిమేను బాలు, సత్తి దేవదానరెడ్డి పాల్గొన్నారు.

వివేకానంద సందేశాలను ఆచరించాలి

రాజానగరం, సెప్టెంబరు 19: స్వామి వివేకానంద సందేశాలను యువత ఆచరించాలని రామకృష్ణ మిషన్ రాజమహేంద్రవరం కేంద్ర కార్యదర్శి స్వామి పరిజ్ఞానంద ప్రబోధించారు. గైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎంవీఎస్ బాబు అధ్యక్షతన గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చికాగోలో వివేకానంద విశ్వమత మహాసభలో ప్రసంగం చేసి 131 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 27న రాజమహేంద్రవరంలో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా స్వామి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీఎస్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డైరెక్టర్ పీఆర్‌కే రాజు, ప్రముఖ న్యాయవాది పి.శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొంకుదురులో దసరా ఉత్సవాలకు శ్రీకారం



బిక్కవోలు, సెప్టెంబరు 19: కొంకుదురు గోపాలనాయుడు వీధిలో నిర్వహించే దసరా ఉత్సవాలకు శ్రీదేవి బాల భక్త సమాజం గురువారం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా ఉత్సవాలకు కర్తలుగా వ్యవహరించనున్న తమలంపూడి సుధాకరరెడ్డి, వరలక్ష్మి దంపతులు పందిరిరాట వేసి ఉత్సవ పనులు ప్రారంభించారు. ఈ ఏడాది 65వ సంవత్సరంలోకి అడుగిడుతున్నామని అందువల్ల అమ్మవారికి సహస్ర ఘటాభిషేకం నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మట్టిపై పన్ను తొలగించండి

సీఎం చంద్రబాబుకు నర్సరీరైతులు, ప్రజాప్రతినిధుల వినతి


సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కడియం, సెప్టెంబరు 19: ఎర్ర మట్టిపై వేలాది రూపాయలు పన్నుగా విధించారని, దానిని తొలగించి నర్సరీరంగానికి తోడ్పాటునివ్వాలని కడియం నర్సరీ రైతులు సీఎం చంద్రబాబుకు విన్నవించారు. ఈ మేరకు గురువారం మంత్రులు కొల్లు రవీంద్ర, కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సమక్షంలో వారు వినతిపత్రం అందజేశారు. నర్సరీ రంగంపై అనేక మంది జీవిస్తున్నారన్నారు. మొక్కల పెంపకానికి మట్టి ప్రధానమని, దానిపై ఆంక్షలు, పన్నులు విధిస్తే నర్సరీరంగం ముందుకు సాగదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, నర్సరీ సంఘ అధ్యక్షుడు మల్లు పోలరాజు, జనసేన మండలాధ్యక్షుడు ముద్రగడ జమీ, వైస్ ఎంపీపీ పంతం గణపతి ఉన్నారు.ఈ సందర్భంగా సీఎంను మార్గాని సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం'

కోరుకొండ, సెప్టెంబరు 19: నియోజకవర్గంలో వారంరోజుల పాటు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో అభివృద్ధి, సంక్షేమం చూసి మాది మంచి ప్రభుత్వమని ప్రజలు చెప్పుకుంటున్నారని పేర్కొంది. ఈ శుభ సందర్భంలో ప్రజల వద్దకు పాలకులను పంపించి మరిన్ని సేవలందించాలనే సదుద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం ఈ నెల 20 నుంచి 7రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని, ముందుగా సీతానగరం మండలం ఇనుగంటివారిపేట, రామచంద్రాపురం గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొనాలన్నారు.

రాజా ప్యానల్ నామినేషన్ దాఖలు

ఏకగ్రీవానికి చర్చలు.. చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు


రాజా ప్యానల్ నామినేషన్లను ఎన్నికల అధికారికి అందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 19: ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో టీడీపీ వాణిజ్య విభాగం నాయకుడు తవ్వా రాజా ప్యానల్ నామినేషన్ దాఖలు చేశారు. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ నేత గన్ని కృష్ణ, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, జనసేన నగరిఇంచార్జీ అనుశ్రీ సత్యనారాయణ, ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కోళ్ళ అచ్యుతరామారావు విచ్చేశారు. రాజా నామినేషన్ పత్రాలను వారి చేతులమీదుగా ఎన్నిల అధికారికి సమర్పించారు. కార్యక్రమంలో చాంబర్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, నందెపు శ్రీనివాస్, బూర్లగడ్డ సుబ్బారాయుడు, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు కూటమి నాయకులు చర్చలు జరుపుతున్నారు. రాజా ప్యానల్‌లో అన్నివర్గాలకు చెందిన వారు ఉండడంతో ఏక గ్రీవం చేయాలనే ఆలోచనతో చర్చిస్తున్నారు. రాజా ప్యానల్ నామినేషన్లు వేసినప్పటికీ పోలింగ్ జరగకుండా అందరి ఆమోదం పొందే విధంగా ప్రయత్నాలు సాగుతున్నాయి.

రాష్ట్రస్థాయి టీటీ పోటీలకు విద్యార్థి ఎంపిక

అనపర్తి, సెప్టెంబరు 19: తమ పాఠశాల విద్యార్థి ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీల్లో తృతీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనటు పొలమూరు జడ్పీ హైస్కూల్ పీడీ ప్రభాకరరెడ్డి తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పెంకే వీరవెంకట సత్యనారాయన ఇటీవల కాకినాడలో జరిగిన అండర్-14 పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎస్ఎంసీ చైర్మన్ వాశంశెట్టి నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు, విద్యార్థులు అభినందించారు.

జిల్లాస్థాయి షార్ట్‌పుట్‌లో బాలసరస్వతికి ఫస్ట్

రంగంపేట, సెప్టెంబరు 19: తూర్పుగోదావరి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతున్న పెమ్మనబోయిడి బాలసరస్వతి జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో అం డర్-18 విభాగంలో షార్ట్‌పుట్‌లో ప్రథమస్థానం, డిస్కస్‌త్రోలో తృతీయ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ బి.హేమ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు కృష్ణమూర్తి, మాధురి, శేఖర్‌బాబు, ప్రసాద్,శ్యామలరావు,రమణ, కృష్ణ అభినందించారు.

వరద బాధితులకు డ్వాక్రా యానిమేటర్ల సాయం

కోరుకొండ, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి కోరుకొండ డ్వాక్రా యానిమేటర్లు రూ.25 వేలు అందజేశారు. ఈ మేరకు వారు గురువారం బూరుగుపూడి గేటు వద్ద టీడీపీ కార్యాలయం వద్ద బొడ్డు వెంకటరమణచౌదరిని కలిసి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారిని బీవీఆర్ అభినందించారు. ఈ ఇలాంటి పరిస్థితుల్లో ప్రతిఒక్కరు మానవత్వంతో స్పందించాలన్నారు. కార్యక్రమంలో యానిమేటర్ల యూనియన్ నాయకురాలు పరమేశ్వరి, లక్ష్మికుమారి తదితరులు పాల్గొన్నారు.

రామవరం-రాయవరం రోడ్డు పనులు

అనపర్తి, సెప్టెంబరు 19: మండలంలోని రామవరం నుంచి మండపేట మండలం రాయవరం వరకు రూ.1.50 కోట్లతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టారు. పనులను ఎమ్మెల్యే తనయుడు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో చింతా సురేష్‌రెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో ఆరోగ్య సిబ్బంది

సేవలు అభినందనీయం

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 19: విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో జిల్లాకు చెందిన ఆరోగ్య సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా కార్యాలయంలో ఉద్యోగులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి 70 మంది పురుష ఆరోగ్యసహాయకులు విజయవాడ వెళ్లారని, వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా సేవలందించారన్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారని అన్నారు. అంకితభావంతో సేవలందించిన ఆరోగ్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.

పంట అధిక దిగుబడికి పొటాష్ దోహదం

ఏడీఏ శ్రీనివాస్‌రెడ్డి.. సామూహిక ఎలుకలు నివారణ

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 19: ప్రస్తుతం వరి పంట చిరు పొట్టదశలో ఉందని ఈ సమయంలో పోటాష్ వాడకం వలన వరి పంటకు తెగుళ్లను, పురుగులను తట్టుకొనే శక్తి వస్తుందని, అధిక దిగుబడికి ఇది ఎంతో అవసరమని ఏడీఏ డి.శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. మండలంలోని రాజవోలు గ్రామంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. అలాగే జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు రామలక్ష్మి మాట్లాడుతూ రైతులు విచక్షణ రహితంగా పురుగు మందులు వాడొద్దని, పురుగు, తెగుళ్ల నష్టపరిమితిని దృష్టిలో ఉంచుకొని అవసరం మేరకే వాడాలని, వాడేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవో ఎ.భీమరాజు మాట్లాడుతూ రైతులుందరు ఒకేసారి ఎలుకల నివారణ చేపట్టాలన్నారు. రైతుసేవా కేంద్రలలో ఉచితంగా ఎలుకల మందు అందజేస్తారన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోడిగుడ్డు, నిమ్మరసంతో పంటకు అవసరమైన పోషక ద్రవాన్ని తయారు చేసి చూపించారు. మండల ఉద్యానవన అధికారి డి.సుధీర్‌కుమార్ ఏపీఎంఐపీ ద్వారా డ్రిప్ స్ప్రింక్లర్ రాయితీ, ఆర్‌కేవీవై ద్వారా శాశ్వత పందిళ్లు, కలెక్షన్ సెంటర్లు, ఎన్ఎమ్ఈవోపీ ద్వారా ఆయిల్‌పామ్ విస్తరణ పథకం ద్వారా రైతులు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు మార్ని శ్రీనివాస్, వంక కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సెంట్రల్ జైలు పరిశీలన


జైలులోని పరిసరాలను పరిశీలిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాశ్‌బాబు గురువారం కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం తదితర సదుపాయాలను పరిశీలించారు. ఉచితంగా వాదించడానికి న్యాయవాది అవసరమైనా, బెయిల్ పిటిషన్లు, హైకోర్టుల్లో అప్పీలు తదితర న్యాయ సహాయం కోసం సంస్థ నియమించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా డీఎల్ఎస్ఏకి అర్జీ పెట్టుకోవాలని ఆయన సూచించారు. ముద్దాయిలు, ఖైదీలకు న్యాయ సహాయం చేయడానికి పని చేస్తున్న లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ గురించి వివరించారు.

ఇంద్ర ధనస్సు పుస్తకావిష్కరణ


రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 19: విశ్రాంత న్యాయమూర్తి, రచయిత, కవి, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం పురస్కార గ్రహీత, 50 గ్రంథాలు రాసిన పృథ్వీ మరో పుస్తకం 'ఇంద్ర ధనస్సు' రచించారు. దీనిని నన్నయ విశ్వవిద్యాలయంలో వీసీ శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. తెలుగు ఉపన్యాసకుడు తలారి వాసు, సైకాలజీ ఉపన్యాసకుడు పి.రాజశేఖర్ తదితరులు విచ్చేసి పృథ్వీని అభినందించారు. కళాగౌతమి అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు, కార్యదర్శి సీహెచ్ రమాదేవి.. పృథ్వీ సాహిత్య కృషిని కొనియాడి, శుభాకాంక్షలు తెలిపారు.



నేటి నుంచి 'మన మంచి ప్రభుత్వం'

జనంలోకి ప్రజాప్రతినిధులు

కూటమి ప్రభుత్వం పాలన 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మంచి ప్రభుత్వం పేరుతో కూటమి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుతో అం దరూ ప్రజల వద్దకు వెళ్లి ఇప్పటి వరకూ చేసిన పనులు చేయబోయే పనుల గురించి ప్రజలకు వివరించనున్నారు. జిల్లావ్యాప్తంగా ఏడు నియోజకవర్గాల్లోనూ శుక్రవారం ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమం ప్రారంభిస్తారు. నియోజకవర్గాల్లో మన మంచి ప్రభుత్వం సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు, సూచనలు, సలహాలు స్వీకరిస్తారు.



హైవేలో లైట్లు వేయాలని ఎప్పుడో లేఖ రాశాం


- చిరుతను బంధించడానికి చర్యలు
- హైవేలోనూ సీసీ కెమెరాల ఏర్పాటు
- ఊర కుక్కలు..పందులే ఆహారం
- 'ఆంధ్రజ్యోతి'తో డీఎఫ్‌వో భరణి



రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రిజర్వు ఫారెస్టులో సంచరిస్తున్న చిరుత పులిని బంధించడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుం టున్నామని'ఆంధ్రజ్యోతి'కి జిల్లా ఫారెస్టు అధికారి (ఇన్‌చార్జి) భరణి తెలిపారు. అభయారణ్యం ఆనుకొని ఉన్న ఆవాసాల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. చిరుత పులి ప్రస్తుతం దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలోమాత్రమే తిరుగుతుందని తెలిపారు. పులి జాడ కనుగొనేందుకు గత 13 రోజులుగా 100 ఫ్లాష్ కెమెరాలు, 7 ట్రాప్ కేజ్‌లు, 10 సీసీ కెమెరాల ద్వారా ప్రత్యక్షవీక్షణం చేస్తున్నామన్నారు. కేంద్ర పర్యావరణశాఖ ఆధ్వర్యంలో ఉన్న న్యూఢిల్లీలోని ఎన్‌టీసీఏ, రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారుల సలహాలు సూచనలు మేరకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఇంత వరకూ చిరుతపులి మనుషులమీద దాడిచేసిన దాఖలాలు లేవని తెలిపారు. చిరుతపులి ఊర కుక్కలు, పందులను ఆహారంగా తీసుకుంటుందని తెలిపారు. ప్రజలకు హాని జరగకుండా చిరుతపులిని బంధించడానికి అహర్నిశం శ్రమిస్తున్నామని తెలిపారు. జాతీయ రహదారిలో హెచ్చరిక బోర్డులు, కెమెరాలు ఏర్పాటు చేశామన్నా రు.రాత్రి వేళల్లో సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) కు లేఖ రాసి చాలా రోజులైందన్నారు. కానీ ఇప్పటి వరకూ ఏర్పాటు కాలేదని పేర్కొన్నారు. దీంతో శాఖల మధ్య సమన్వయ లోపం పులికి వరంగా.. ప్రజలకు శాపంగా మారిందనే వాస్తవం బయట పడింది. పులి జాతీయ రహదారిని అటూ ఇటూ దాటు తోందని అటవీ అధికారులు ఇప్పటికే నిర్ధారించారు. సరిపడా లైటింగ్ ఏర్పాటు చేస్తే వాహనదారులు దూరం నుంచే అప్రమత్తమై వాహన వేగం తగ్గించి సురక్షితంగా వెళ్లే అవకాశం ఉంటుంది. రాత్రి వేళల్లో అక్కడ చిమ్మచీకటి వల్ల ఒకవేళ రోడ్డు పక్కన పులి నక్కినా సమీపానికి వెళ్లే వరకూ తెలియదు. జాతీయ రహదారి పరిసరాల్లో కెమెరాలు ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ పులి రోడ్డు దాటుతున్నప్పుడు కెమెరాల్లో ఎందుకు ఫొటో పడలేదో తెలియదు.పులి దగ్గరగా వస్తే చేతులు ఊపుతూ కేకలు వేయండని దూరంగా ఉంటే నిశ్శ బ్దంగా కదలకుండా ఉండండంటూ లాజిక్ చెబుతున్న అధికారులు.. అసలు పులి ఎదురుపడితే ఆ సమ యంలో సదరు వ్యక్తి పరిస్థితి ఏమిటో అంచనా వేయడంలో వెనకబడినట్టు వినవస్తోంది.ఇప్పటికైనా పులి సంచరించే పరిధిలో ఉన్న జాతీయ రహదారిపై సరిపడా లైట్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.ఏదేమైనా 'ఆపరేషన్ చిరుత' ఎలాంటి దుర్ఘటనలూ జరగకుండా సాధ్యమై నంత త్వరగా ముగియాలని ప్రజలు కోరు కుంటున్నారు.

ట్రాప్ కెమెరాలో అడవి పిల్లి 6

వందనం.. అభివందనం



అధికారం అరాచకమై ఐదేళ్లు కారుచీకట్లు కమ్ముకున్న వేళ.. కాగడా పెట్టి వెదికినా పిసరంతైనా కనిపించని అభివృద్ధి జాడల నడుమ.. జీతాలు అసలు ఎప్పుడు వస్తాయో తెలి యని అత్యంత గడ్డు పరిస్థితుల మధ్య..పల్లె ప్రగతికి ప్రతిరూపాలైన పంచాయతీలను కకావికలం చేసిన పాలన సాక్షిగా.. పేదోడి ఆకలిపైనా రాజకీయ అక్కసు ప్రదర్శించి రాక్షసా నందం పొందిన నిరంకుశత్వం బద్దలై ప్రజల ఆకాంక్షల నుంచి ఉదయించిన కూటమి ప్రభుత్వానికి సరిగ్గా వంద రోజులు పూర్తయింది. ప్రజల ఆకాంక్షలకు పట్టం కడుతూ.. అభివృద్ధే కంకణంగా...ఇచ్చిన హామీలను ఒక్కోటిగా నిజం చేస్తూ..వైసీపీ అరాచకత్వంతో కుంటుపడ్డ జిల్లాకు మళ్లీ జవసత్వాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం జిల్లా రూపురేఖ లను మార్చే దిశగా ఈ వందరోజుల్లో వడివడిగా ఎన్నో అడుగులు వేసుకుంటూ కదులు తోంది. ఈ వంద రోజుల పాలనకు జనం వంద మార్కులు వేసేసి.. వంద నం.. అభివందనం అంటు న్నారు. నియోజక వర్గాల్లో సమస్యలు తెలుసుకునేం దుకు మన మంచి ప్రభుత్వం పేరుతో ఎమ్మెల్యేలు నేటి నుంచి ప్రజల్లోకి వస్తున్నారు..

- (రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వంద రోజుల పాలన సూపర్ హిట్.. ఇదీ ప్రజాభిప్రాయం..ఎందుకంటే కూటమి ప్రజా ప్రభుత్వం.. ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు.. వృద్ధులు తదితర వర్గాలకు ఒకటినే పింఛన్లు.. కష్ట మొచ్చినా కన్నీళ్లు రాకుండా కాశారు.. అటువంటి ప్రభుత్వానికి వంద రోజులు పూర్తయింది. వంద రోజుల్లో సీఎం చంద్రబాబు రెండు సార్లు ఉమ్మడి జిల్లాలో పర్యటించారు. అందుకే ప్రజలు ప్రజలు వంద మార్కులు వేసేశారు..అయితే సీఎం చంద్రబాబుకు మాత్రం ఇంకా ప్రజలకు ఏదో చేయలేకపోతున్నామనే వెలితి.. చేయాలనే కసి..అసలు పాలన ఎలా ఉంది.. ప్రజలకు నచ్చిందా లేదా.. ఏమైనా మార్పులు.. చేర్పులు ఉన్నాయా.. అంటూ నేటి నుంచి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్యటించాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగులకు ఒకటినే జీతాలు..

జిల్లాలో ప్రభుత్వసచివాలయ ఉద్యోగులు, పెన్షనర్లు కలిపి 20వేల మందికిపైగానే ఉన్నారు. గత వైసీపీ పాలనలో అసలు జీతాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో ఠంచనుగా ఒకటో తేదీకే జీతాలు జమైపోతున్నాయి. సీఎం చంద్రబాబు చొరవ, ముందుచూపుతో ఉద్యోగుల జీతా లకు ఇబ్బందులు లేకుండా ఒకటో తేదీనే జమవుతుండడం పెద్ద మార్పు అని ఉద్యోగులంతా ముక్తకంఠంతో చెబుతున్న పరిస్థితి.గత ప్రభుత్వంలో ఉద్యోగులపై వేధింపులు,బూతులు, బెదిరింపులతో స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు ఉండేవి కావు.కూటమి వచ్చాక ఉద్యో గుల పనితీరులో స్వేచ్ఛాయుత వాతావరణం ఏర్పడింది.

పింఛన్ టెన్షన్ తీర్చారు..

జిల్లాలో వృద్ధులు, వితంతులు, దివ్యాంగులు, ఇతర కేటగిరీలకు చెందిన 2.40 లక్షల మందికి పింఛన్ నెలకు రూ.102 కోట్లు పంపిణీ చేస్తున్నారు. అప్పటి వరకు ఉన్న రూ.3వేల పింఛనును రూ.4వేలు చేసింది. దివ్యాంగులకు రూ.6వేలు,పూర్తిస్థాయి వైకల్యం చెందిన వారికి రూ.15వేలు, ఇతర వ్యాధిగ్రస్తులకు రూ.10వేలు చొప్పున అందిస్తోంది. వాస్తవానికి నెలనెలా పింఛన్‌ను ఒకటో తేదీనే ఇంటికి వెళ్లి ఇస్తున్నామంటూ గత వైసీపీ సర్కారు హడావుడి చేసేది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీనే సచివాలయ ఉద్యోగుల ద్వారా ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది.

నేటి నుంచి జనంలోకి ఎమ్మెల్యేలు

- కూటమి పాలనకు వంద రోజులు
- ఒకటినే పింఛన్లు..జీతాలు
- దౌర్జన్యాల్లేవ్.. దాడుల్లేవ్
- మారిన పాలనా తీరు
- ప్రజల మన్నన..వంద మార్కులు
- ఒక్కొక్కటిగా హామీల అమలు

పంచాయతీలకు జవసత్వాలు..

జిల్లాలో 299 పంచాయతీలున్నాయి.గత ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను నిర్వీర్యం చేసింది. వీటికి వచ్చే ఆర్థిక సంఘం నిధులను దారి మళ్లించేసింది. ఇలా పంచాయతీ వ్యవస్థ మొత్తం నిర్వీర్యమైపోయింది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం,డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ శాఖ పర్యవేక్షిస్తుండడంతో మళ్లీ పంచాయతీలకు మునుపటి గౌరవం దక్కేలా చేశారు. ఇటీవల జిల్లాలో పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. జెండా వందనం కోసం కేవలం రూ.2 వేలు ఉండే బడ్జె ట్‌ను కూటమి ప్రభుత్వం రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు డ్రాచేసుకునే స్వేచ్ఛ కల్పించింది. గ్రామసభలను ఒకేసారి నిర్వహించి రికార్డు సృష్టిం చింది.

దీపావళికి మూడు గ్యాస్ సిలిండర్లు

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పథకాలు ప్రకటించింది. అందులో ఒక్కో హామీని వడివడిగా అమలు చేస్తోంది. ఇప్పటికే పింఛన్ల పెంపు అమలు చేసింది. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ ఇవ్వబోతోంది.ఇంటింటికి కుళాయిపైనా సమీక్షించింది.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపైనా ఇప్పటికే అధ్యయనం పూర్తి చేసింది. గత వైసీపీ ప్రభుత్వం నాసిరకం మద్యం స్థానంలో వచ్చే నెల ఒకటి నుంచి నాణ్యమైన మద్యం విక్రయించడానికి ఏర్పాట్లు చేస్తోంది. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లకు సంబంధించి అమలు ఎప్పుడు జరుగుతుందోననే చర్చ ప్రజల్లో జరుగుతో ంది.వీటి అమలుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.జిల్లాలో రబీ ధాన్యం బకాయిలన్నీ చెల్లించారు. గత ప్రభుత్వం పేదల కాలనీ పేరిట మొదలెట్టి వదిలేసిన కాలనీల్లో కొంతభాగం పెండింగ్‌లో ఉన్న సుమారు 4 వేల ఇళ్లను 100 రోజుల్లో పూర్తి చేసే లక్ష్యం పెట్టుకున్నారు. ఉచిత ఇసుక అమల్లోకి తెచ్చారు. రేపో మాపో పూర్తి స్థాయిలో ఇసుక అమలులోకి రానుంది. రాజమ హేంద్రవరంలోని మో రంపూడి ఫ్లయ్ ఓవర్‌ను పూర్తి చేశారు.

ఆకలి తీరుస్తున్నారు..

పేదోడి ఆకలి తీర్చడానికి కూటమి ప్రభుత్వం ఆగస్టులో అన్న క్యాంటీన్లను ప్రారంభించింది. ఐదేళ్ల పాటు జగన్ ప్రభుత్వం వీటికి గ్రహణం పట్టించింది. అధికారంలోకి రాగానే అప్పటి వైసీపీ సర్కారు అన్న క్యాంటీన్లను మూసేసింది. కూటమి రాగానే జిల్లాలో మొత్తం ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేసింది. మలి విడతలో త్వరలో మరో కొన్ని ప్రారంభించనుంది. రాజమహేంద్రవరంలో 3, కొవ్వూరులో 1, నిడదవోలులో ఒకటి ఏర్పాటు చేసి రూ.15కే టిఫిన్, మధ్యాహ్నం,రాత్రి భోజనం పెడుతున్నారు. దీనివల్ల వంద లాది మంది పేదల కడుపు నిండుతోంది.

ప్రజల మన్ననలు పొందాం



ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికి 100 రోజులు పూర్తి చేసుకుని ప్రజల మన్ననలు పొందాం.. అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తున్నాం. జిల్లాలో ఎమ్మెల్యేలు సూచించిన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ.269.64 కోట్లు శాంక్షన్ చేయించా. రాజమండ్రిలోని అల్లు రామలింగయ్య ప్రభుత్వ హోమియో మెడికల్ కాలేజీకి 2024 -25కి 23 పీజీ సీట్లకు అనుమతి తెచ్చాం.

- దగ్గుబాటి పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు



పర్యాటక అభివృద్ధిపై దృష్టి : మంత్రి దుర్గేష్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండేలా చేశాం. జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించాం. కడియం నుంచి అడుగులు పడతాయి. నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా అక్కడ అభివృద్ధికి పాటుపడుతున్నా.

రూ.350 కోట్ల అభివృద్ధి పనులు ప్రతిపాదించాం



కూటమి వంద రోజుల పాలనలో ప్రజలకు ప్రశాంత వాతావరణంకల్పించాం.నియోజకవర్గంలో రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక సదుపా యాల కల్పనకు రూ.350 కోట్లతో పనులు ప్రతిపాదించాం. కడియం నర్సరీలు టూరిజం హబ్‌గా చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఆవ కాలువ ఆక్రమణలు తొలగించి ముంపు లేకుండా చేశాం.

- గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే

మీ భద్రత- మా బాధ్యతగా తీసుకున్నా..



వందరోజుల కూటమి ప్రభుత్వం పాలనలో రాజమహేంద్రవరం సిటీ లో ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేశాం.మీ భద్రత- మా బాధ్యత పేరుతో డివిజన్ల వారీ సమావేశాలు పెట్టి ప్రజల్లో చైతన్యం కలిగిం చాం.గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లు అరికట్టాం.అనేక అభివృద్ధి పనులతో ప్రజల్లో ఉన్నాం. - ఆదిరెడ్డి వాసు, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నా..



నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడుతున్నా.వేమగిరి సామర్లకోట రహదారిని నేషనల్ హైవేగా మార్పుచేసేలా సీఎం చంద్రబాబుతో కేంద్రమంత్రి గడ్కరీకి లేఖ రాయించా.కెనాల్ రోడ్డు తక్షణ మరమ్మతు లకు రూ. 6.33 కోట్ల నిధులు మంజూరు చేయించా. రంగంపేట మండలంలో రూ.6.50 కోట్ల నిధులతో రెండు రోడ్ల నిర్మాణం. ఏడు దేవాలయాల అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేయించా. - నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే అనపర్తి

గోదావరి నీళ్లిస్తాం



వందరోజుల పాలనలో ప్రజల అభిమానం పొందాం. వచ్చే ఐదేళ్లలో అనేక పనులకు ప్రతిపాదనలు చేశాం. మునిసిపాలిటీకి రూ.58 కోట్లు,రూరల్‌లో రూ.96 కోట్లతో గోదారి నీటి సరఫరాకు ప్రతిపాదనలు చేశాం.

- ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు

3500 వినతుల పరిష్కారం



ప్రజల నుంచి జనవాణికి 3,800 వినతులు రాగా 3500 పరిష్కరించాం. శుక్ర వా రం సీతానగరం మండ లం ఇనుగంటివారిపేట, రామచంద్రాపురం గ్రామాల్లో ఇది మంచి ప్రభు త్వం కార్యక్రమం నిర్వహిస్తాం.

- బత్తుల బలరామకృష్ణ, రాజానగరం

ప్రజల్లో నమ్మకం ఏర్పడింది..



వందరోజుల పాలన ప్రజల్లో మంచి నమ్మకాన్ని కలిగించింది. ప్రజల సంక్షేమ,అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాం. ఇటీవల నియోజకవర్గంలో జరిగిన 85 గ్రామ సభల్లో తీర్మానాలు తీసుకున్నాం.

- మద్దిపాటి వెంకట్రాజు, గోపాలపురం

జీజీహెచ్‌లో శిశుమరణంపై త్రీమెన్ కమిటీ విచారణ

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 19 : రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో ఇటీవల జరిగిన శిశు మరణంపై గురువారం త్రీ మెన్ కమిటీ విచారణ జరిపింది. కమిటీ సభ్యులు డాక్టర్ హేమంతి, డాక్టర్ మోహన్‌చంద్ర, డాక్టర్ కుమార్ ఈ విచారణ నిర్వహించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి తల్లిదండ్రులు మాట్లాడుతూ తల్లీ బిడ్డల వార్డులో ఈనెల 4వ తేదీన తమ కుమార్తెను డెలివరీ కోసం చేర్పించామని, అయితే సాయంత్రం వరకూ వైద్యులు పట్టించుకోకపోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగిందని తెలిపారు. దీన్ని తాము వైద్యుల దృష్టికి తీసుకువెళ్లగా ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేశారని, కానీ పుట్టిన బాబు చనిపోయాడని చెప్పడంతో షాక్‌కు గురయ్యామని తెలిపారు. వైద్యులు కాలయాపన చేయడం వల్లే తల్లికి, తమకు అన్యాయం జరిగిందని వివరించారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని కమిటీ సభ్యులు వారికి తెలిపారు. గర్భిణీ వాసవి దత్తసాయి తరపున ఆమె తల్లిదండ్రులు ఈశ్వరరావు, కవిత ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభకు, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఇటీవల వినతిపత్రాలు అందజేశారు.

వినాయక విగ్రహం వేలం

దేవరపల్లి, సెప్టెంబరు 19: దేవరపల్లిలో మెరకవీధి వినాయక విగ్రహం పాట రూ.లక్షా 65వేలకు దేవరపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కైరం అప్పారావు పాడుకున్నారు. ఆలయం వద్ద గురువారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విగ్రహ వేలం నిర్వహించారు. పాటలో కైరం అప్పారావు పాడుకున్నారు. దేవరపల్లి ఆలయం వద్ద 42 ఏళ్లగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అత్యధికంగా రూ.లక్షా 65 వేలకు పాట వెళ్లడంతో అర్చకులు, గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

నాలుగు ప్రాంతాల్లో పర్యాటకాభివృద్ధి

మంత్రి కందుల దుర్గేష్



రేలంగి విగ్రహావిష్కరణలో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందీశ్వరి, ఎమ్మెల్యేలు వాసు, బత్తుల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈనెల 27న పర్యాటక రంగానికి సంబంధించిన 38 విభాగాల్లో అవార్డులను అర్హులకు సీఎంచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేతుల మీదగా ప్రదానం చేయనున్నట్టు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెంట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్టిమెంట్ (శాసి) పథకం కింద నాలుగు ప్రాంతాల్లో ఐకానిక్ టూరిజం హబ్‌లను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించామన్నారు. కేంద్రం టూరిజం మంత్రి ఇప్పటికే రూ.250 కోట్లు కేటాయించారని.. కాని తాము సుమారు రూ.400కోట్లు అడుగుతున్నామన్నారు. ఒకటి శ్రీశైలంలో టెంపుల్ టూరిజంతో పాటు టైగర్ రిజర్వుడు ఏరియా, వాటర్‌ఫాల్స్ ప్రాంతాలను కలుపుకుని అభివృద్ధి చేస్తామన్నారు.రెండోది గోదావరి జిల్లాల్లోని ప్రాంతాలన్నీ కలుపుకుని అఖండ గోదావరి ప్రాజెక్టు, మూడోది బాపట్ల బీచ్ కారిడార్, సూర్యలంకలో రిసార్ట్స్ నిర్మిస్తామని, నాల్గోది నంద్యాలలోని సంగమేశ్వరంను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు చేశామన్నారు.వాటి డీపీఆర్‌లతో కేంద్రానికి అక్టోబరు 15న రిపోర్టు ఇస్తామన్నారు. వచ్చే ఏడాదికి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఒక్కో ప్రాజెక్టుకు కనీసం రూ.100 కోట్లు అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. ఎకో టూరిజానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో శాసి, ప్రసాద్, స్వదేశీ దర్శన్ స్కీమ్‌ల కింద టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. తిరుపతి, గండికోటలలో ఒబెరాయ్ సంస్థ టూరిజం అభివృద్ధి చేస్తుందని,ఎడ్వంచర్ టూరిజంలో భాగంగా స్వదేశీ దర్శనం కింద అరకు ,లంబసింగి, బొర్రా గుహలను పర్యాటకంగా తీర్చిదిద్దనున్నామన్నారు.రాజధాని అమరావతిలో మెగా టూరిజం హబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు.ప్రసాద్ (పిలిగ్రిమేజ్ రిజువనేషన్ అండ్ స్పిరుచ్చువల్ హెరిటేజ్ అగ్రిమెంటేషన్ డ్రైవ్) స్కీమ్ కింద అన్నవరం పుణ్యక్షేత్రాన్ని రూ. 25.32 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు.ఏపీ టూరిజంశాఖతో కలసి పనిచేయడానికి వియత్నాం నుంచి శుక్రవారం ప్రతినిధులు రానున్నట్టు తెలిపారు. ఆంధ్రలో స్టూడియోలు నిర్మించడానికి ముందుకు వస్తే ప్రభుత్వ తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. సినిమా షూటింగ్‌లకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇస్తామని చెప్పారు. సమావేశంలో రాజమండ్రి సిటీ జనసేన్ ఇన్‌చార్జి, అనుశ్రీ సత్యనారాయణ,టౌన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేలంగి విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ,సెప్టెంబరు 19: సమయస్ఫూర్తితో హాస్యం పండించడంలో దిట్ట హాస్యనటుడు రేలంగి వెంకట్రామయ్య అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.రాజమహేంద్రవరం గోదావరి బండ్ గౌతమి నందనవనంలో రాజమండ్రి గౌడ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హాస్యనట చక్రవర్తి రేలంగి వెంకట్రామయ్య నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు.రేలంగికి ముందు తర్వాత ఎందరో నటులు వచ్చినప్పటికి రేలంగి ఉచ్చారణ,హావభావాలు మరెవరికి రాలేదన్నారు. పద్మశ్రీ పురస్కారం పొందిన తొలి హాస్యనటుడు రేలంగి అని కొనియాడారు. ఎంపి పురందేశ్వరి మాట్లాడుతూ రేలంగి విగ్రహావిష్కరణలో పాల్గొన ఈ రోజు మరువురానిదన్నారు. తన తండ్రి ఎన్‌టీఆర్‌కి రేలంగికి అవినాభావ సంబంధం ఉందన్నారు. ఎన్‌టీఆర్ రేలంగి బావ అని ఆప్యాయంగా పిలిచేవారన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ చరిత్రలో నిలిచిపోయిన హాస్యనటుడు రేలంగి అన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గొప్ప హాస్యనటుడు రేలంగి అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ రేలంగి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని గౌడశెట్టిబలిజి సంఘం నాయకులు వచ్చి కలిసినప్పుడు చాలా ఆనందపడ్డానన్నారు.



గుమిగూడిన ఆందోళనకారులు.. పోలీస్ బలగాలతో ఎస్పీ నరసింహకిశోర్..దాడిలో ధ్వంసమైన స్కూటర్

వినాయకుడి శోభాయాత్రపై రాళ్లదాడి

రెండు వర్గాల మధ్య ఘర్షణ.. కొవ్వూరులో ఉద్రిక్తత

కొవ్వూరు, సెప్టెంబర్ 19 : కొవ్వూరు పట్టణంలో వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. మూడురోజుల కిందట పట్టణ రాజీవ్‌కాలనీలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఊరేగింపు సమయంలో రాజీవ్‌కాలనీ, తునిపేటకు చెందిన రెండువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. రాజీవ్‌కాలనీ నుంచి గురువారం మరో వినాయక విగ్రహం నిమజ్జనానికి శోభాయాత్రగా బయలుదేరింది.రాజీవ్‌కాలనీ నుంచి శ్రీరామకాలనీ మీదుగా వినాయకుడి శోభాయాత్ర దొమ్మేరు, కొవ్వూరు రాష్ట్ర రహదారికి వచ్చే దారిలో కొంతమంది అల్లరిమూకలు దారికాచి రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో రాజీవ్‌కాలనీకి చెందిన చొక్కా నందకిశోర్ తలకు గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా కుట్లు పడ్డాయి. నందకిశోర్‌తో పాటు మరి కొంతమందికి గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఇంటికి వెళ్లిపోయారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించిన కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.శ్రీహరికి స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డు పక్కన పార్క్‌చేసిన పలకంశెట్టి సురేష్ స్కూటర్‌ను ఆందోళనకారులు ధ్వంసం చేశారు. పురపాలక సంఘానికి చెందిన ఇంటింటా చెత్త సేకరించే వాహనాన్ని ధ్వంసం చేశారు. రెండువర్గాలు ఒకరిపై ఒకరు విచక్షణారహితంగా రాళ్లు, కర్రలు విసురుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ బి. నరసింహకిశోర్ అదనపు బలగాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జిల్లా పరిధిలోని పోలీసు యంత్రాంగాన్ని కొవ్వూరు రప్పించి ఆందోళనకారులను చెదరగొట్టడంతో వివాదం సద్దుమణిగింది. గురువారం రాత్రి పట్టణమంతా పోలీసులు భారీగా మోహరించారు.పోలీసు పికెటింగ్ ఏర్పాటుచేశారు.

కాపవరంలో పౌష్టికాహార వారోత్సవం

పెరవలి, సెప్టెంబరు 19: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే బాలామృతం పిల్లలకు చక్కటి పౌష్టికాహారంగా ఉపయోగపడుతుందని సీడీపీవో శ్రీలక్ష్మి పేర్కొన్నారు. కాపవరం, ఖండవల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాపవరంలో ఆమె మాట్లాడుతూ తల్లి పాలతో పాటు బాలామృతం పిల్లలకు అందించాలన్నారు. సూపర్‌వైజర్ సీహెచ్‌లక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు అంగన్‌వాడీల సూచనలు పాటించాలన్నారు. ఖండవల్లిలో జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.సరోజిని పాల్గొన్నారు. ఆమెతోపాటు ఏఎన్ఎంలు సరస్వతి, రాణీ రత్నకల, దుర్గాదేవి, కుమారి పాల్గొన్నారు. కాపవరంలో సర్పంచ్ బంటుమిల్లి రత్నాజీ, ఎంపీటీసీ మెర్ల వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీలు కన్యాకుమారి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

డ్రోన్‌తో ప్రకృతి కషాయాలు పిచికారీ

చాగల్లు, సెప్టెంబరు 19: ప్రజల ఆరోగ్యం కోసం ప్రకృతి వ్యవసాయమే ప్రధానమని ఎన్‌ఎఫ్‌ఏ హరీష్ అన్నారు. గురువారం మండలంలోని చాగల్లు, మల్లవరం, నెలటూరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పంట చేలకు కషాయ మిశ్రమాన్ని డ్రోన్‌తో పిచికారి చేశారు. వీటివల్ల దోమ, మాగుడు నివారణ, మొక్కల పెరుగుదలకు ఉపయోగడపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఏ మహారాణి, యూనిట్ ఇన్‌చార్జి రామకృష్ణ, సీఆర్‌పీలు శ్రీనివాస్, పోలవేణి, రత్నకుమారి, రైతులు పాల్గొన్నారు.



గో గ్రీన్ సేవ్ ఎర్త్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పట్టణంలో విద్యార్థుల గో గ్రీన్...సేవ్ ఎర్త్ ర్యాలీ

నిడదవోలు, సెప్టెంబరు 19: నిడదవోలు పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీఆర్కే ప్రభుత్వ కళాశాల విద్యార్థులతో గో గ్రీన్ సేవ్ ఎర్త్ పై పట్టణ పుర వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జ్యేష్ట వెంకటేశ్వరరావు, కార్యదర్శి బేతిన వి.రామన్, రంగా వెంకటేశ్వరరావు, ప్రసాద్, కళాశాల అధ్యాపక బృందం విదార్థులు పాల్గొన్నారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు

కొవ్వూరు, సెప్టెంబర్ 19: జీడిమామిడి తోటను ధ్వంసం చేసి అడిగితే చంపుతానని బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి తెలిపారు. అత్తిలి గ్రామానికి చెందిన విప్పర్తి సుబ్బలక్ష్మికి దేచర్లలో జీడిమామిడి తోట ఉంది. ఈ నెల 15న దేచర్ల గ్రామానికి చెందిన కస్సే సత్యనారాయణ, నవతేశ్వరి, మహరాజు, మహాలక్ష్మిలుతో పాటు చిక్కాల గ్రామానికి చెందిన ఎం.సత్తిపండు అక్రమంగా తోటలో ప్రవేశించి, చెట్లను నరికివేసి నష్టం కలిగించారన్నారు. దీనిపై వారిని నిలదీయగా చంపుతానని బెదిరించడంతో సుబ్బలక్ష్మి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కొవ్వూరు, సెప్టెంబర్ 19: కర్రతో ఒకరిని గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎం.సునోద్‌కుమార్ తెలిపారు. కొవ్వూరు మండలం దొమ్మేరు సంతపేటకు చెందిన తైలం వీర వెంకట సత్యసాయి, పూతరేకుల వ్యాపారి ఆకాశపు సత్యనారాయణ వద్ద రూ.5వేలు అప్పు తీసుకున్నాడు. గురువారం గ్రామంలోని వినాయకుని గుడి వద్ద ఉన్న సత్యసాయిని అదే గ్రామానికి చెందిన మాణికిరెడ్డి గౌరీచరణ్ వచ్చి దుర్భాషలాడుతూ ఘర్షణకు దిగాడు. నాపేరు చెప్పి పూతరేకులు అమ్మేవాడి వద్ద డబ్బు అప్పు తీసుకున్నావంటూ కర్రతో తలపై దాడిచేశాడు. దీంతో సత్యసాయిని చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి సునోద్‌కుమార్ తెలిపారు.



ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కిశోర బాలికల ర్యాలీ

ఆకుకూరల్లో పౌష్టికాహారం పుష్కలం

కొవ్వూరు, సెప్టెంబర్ 19: ఆకుకూరల్లో పౌష్టికాహారం ఎక్కువగా లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీవో డి.మమ్మీ అన్నారు. గురువారం కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సంస్కృత పాఠశాలల్లో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు ఆర్.విజయలక్ష్మి, ఉదయభాను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.పద్మశ్రీ, గోవర్ధనం శ్రీనివాస మూర్తి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై ప్రతిజ్ఞ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ

చాగల్లు, సెప్టెంబరు 19: పరిశరాలను శుభ్రంగా ఉంచుకుందామంటూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పలు పంచాయతీల వద్ద ప్రతిజ్ఞ చేసారు. చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో వారంలో రెండు గంటలు, సంవత్సరంలో వంద గంటలు శ్రమదానం చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డి శ్రవణ్‌కుమార్, పంచాయతి కార్యదర్శి ఎల్.రవికుమార్, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. బ్రాహ్మణగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది రామచంద్రన్, సారమ్మ, రాజశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ట్రాప్ కెమెరాలో గుర్తించిన అడవి పిల్లి

శ్రీరాంపురం సమీపంలో అడవి పిల్లి గుర్తింపు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 19: దివాన్‌చెరువు ఆటవీ ప్రాంతం శ్రీరాంపురం గ్రామ సమీపంలో అమర్చిన ట్రాప్ కెమెరాలో గత రాత్రి అడవిపిల్లిని గుర్తించినట్టు జిల్లా అటవీ అధికారి ఎస్.భరణి గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. చిరుతపులి, అడవిపిల్లి పాదముద్రలలో చాలా తేడాలుంటాయని వివరించారు. అడవిపిల్లి పాదముద్రలు పరిమాణంలో చిరుతపులి పాదముద్రలు కంటే చిన్నవిగా ఉంటాయన్నారు. గత రాత్రి శ్రీరాంపురం, నేడు కోలమూరు ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు నిపుణులు బృందం వెళ్లి పాదముద్రలను గమనించగా అవి అడవిపిల్లి పాదముద్రలుగా నిర్ధారించారన్నారు. ప్రస్తుతం ఉన్న ట్రాప్‌కెమెరాలను స్థానమార్పులు చేస్తూ, అదనపు ట్రాప్ కెమెరాలను అమర్చి మొత్తం 100 ట్రాప్ కెమెరాలను ఉపయోగిస్తున్నామన్నారు. చిరుతపులిని పట్టుకొనేందుకు 7బోనులును అమర్చి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నివాస ప్రాంతాల్లో చిరుతపులి సంచరిస్తున్నట్టు నిర్ధారణలేదని తెలిపారు. ఆటవీశాఖ వారికి అందరూ సహకరించాలని కోరారు. అసత్యప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. నకిలీ సందేశాలకు పాల్పడిన వారిపై పోలీస్‌శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెరవలి, సెప్టెంబరు 19: పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మల్లేశ్వరం, ఖండవల్లి, ఫీడర్ లైన్‌ల మీద మరమ్మతుల నిమిత్తం నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ వీరభద్రరావు తెలిపారు. దీనివల్ల మల్లేశ్వరం, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, పిట్లవేమవరం, అన్నవరప్పాడు గ్రామాల పరిధిలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయ విద్యుత్‌కు శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి 7 వరకు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5 వరకు ఇస్తామని రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఉన్నత శిఖరాలకు ఆట,పాటలు దోహదం

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



దుద్దుకూరులో నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, సెప్టెంబరు 19: విద్యార్థులకు ఆటపాటలు ఉన్నత స్థానాలకు తీసుకెళుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన క్రీడలను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనం ఏ నిర్ణయం తీసుకున్నా విద్యార్థి దశ నుంచే ధృడంగా ఉండటానికి, మానసిక ప్రశాంతతకు క్రీడలే కారణమన్నారు. విద్యార్థులు చదువులకే పరిమితం కాకుండా క్రీడల్లో రాణించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన క్రీడాకారులుగా తీర్చిదిద్దటానికి నియోజకవర్గంలో అయిదుచోట్ల ప్రత్యేక సౌకర్యాలతో ఉన్నతంగా తీర్చిదిద్దుతామన్నారు. గోపాలపురం నియోజకవర్గం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్ళే క్రీడాకారులతో పాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుల ఖర్చులు భరిస్తానని అన్నారు. క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దటానికి మాజీ చాప్ డైరెక్టర్, రామన్నపాలెం హెచ్ఎం రవీంద్రనాథ్‌ను నియమించి క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా పేరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ సంక్రాంతికి ఎమ్మెల్యే కప్పు, ఫిబ్రవరిలో ఎంపీపీ కప్పు ఏర్పాటు చేసి క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. దుద్దుకూరులో అండర్ 14, 17 స్కూల్ గేమ్స్ ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. నియోజకవర్గస్థాయి క్రీడాకారులను ఎంపిక చేసి వారిని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జడ్పీటీసీ స్వర్ణలత, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనీల్, రామన్నపాలెం హెచ్ఎం రవీంద్రనాథ్, ఎంఈవో తిరుమలదాసు, హెచ్ఎం స్వర్ణకుమారి, సర్పంచ్ బొంతా నాగమణి, టీడీపీ నాయకులు కంటిపూడి సుబ్బారావు, ముళ్ళపూడి దొరాజీ, కరుటూరి అబ్బులు, ముళ్ళపూడి సత్యనారాయణ, కాకర్ల సృజనదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ రామతులసి, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాండ్రూ రామకృష్ణ, పీఈటీలు రామ్‌కుమార్, ఒరుగంటి నాగరాజు, సరస్వతి, రామకృష్ణంరాజు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన చాగల్లు విద్యార్థినులు

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

చాగల్లు, సెప్టెంబరు 19: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చాగల్లు హైస్కూల్ విద్యార్థినిలు ఎంపికయ్యారు. కడపలో శుక్ర, శనివారాలు జరిగే ఈ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. చాగల్లు హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపికైన క్రీడాకారులు జి.జాహ్నవి, రోషిణి, నవ్య, జ్ఞానేశ్వరి, మోనిక, ప్రసన్న గీతా శ్రీవాణి, హారిక, ప్రసన్నలను అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు వి.వీర్రాజు, జీడీ విజయలక్ష్మి, పీఈటీ ప్రేమ్‌చంద్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, పలువురు క్రీడాకారులను అభినందించారు.



నియోజకవర్గ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

స్కూల్ గేమ్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కొవ్వూరు, సెప్టెంబర్ 19: నియోజకవర్గ స్కూల్ గేమ్స్ పోటీలకు ధర్మవరం జడ్పీ హైస్కూల్‌కు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కె.ప్రసాద్ తెలిపారు. కొవ్వూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం జరిగిన స్కూల్ గేమ్స్ పోటీలలో వాలీబాల్ అండర్ 14 విభాగంలో బాలురు ముగ్గురు, బాలికలు 10 మంది, అండర్ 17 విభాగంలో ఇద్దరు బాలురు ఎంపికయ్యారు. ఈ నెల 20న మలకపల్లి జడ్పీ హైస్కూల్‌లో జరిగే నియోజకవర్గ స్కూల్ గేమ్స్‌లో కొవ్వూరు మండలం తరపున వీరు పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయుడితో పాటు, గ్రామ సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



నిడదవోలులో నిమజ్జనానికి తీసుకువెళ్తున్న గణనాథుడు



వేలివెన్నులో వినాయకుడిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనాలు

నిడదవోలు, సెప్టెంబరు 19: నిడదవోలు పట్టణంలోని గణేష్‌చౌక్ సెంటరులోనున్న పూజా గణపతి కుమారస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని గురువారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా భారీ గణనాథుడిని పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఊరేగించి పశ్చిమ డెల్టా కాలువలో నిమజ్జనం చేశారు. పట్టణ సబ్ ఇన్‌స్పెక్టర్ పసుపులేటి శోభన్ కుమార్ ఊరేగింపు సజావుగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నారు. ఆలయ కమిటి ప్రతినిధులు కారింకి సాయిబాబు, కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు, సరిదే సత్యం, పలువురు కమిటీ సభ్యులు నిమజ్జనం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేలివెన్నులో వైభవంగా

ఉండ్రాజవరం, సెప్టెంబరు 19: మండలంలోని వేలివెన్నులో గురువారం వినాయకుడి ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక రథంపై ఉంచి ఊరేగించారు. కేరళ డప్పులతో నృత్యాలు, ప్రత్యేక బ్యాండ్ మేళాలు, వివిధ రకాల డాన్సులతో స్వామివారి ఊరేగింపు కొనసాగింది. లక్ష్మి గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఉండ్రాజవరం ఎస్సై జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. వేలివెన్నుతో పాటు చుట్టుప్రక్కల మండలాల భక్తులు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.

విజయవాడ వరద బాధితులకు విరాళాల వెల్లువ



వరద బాధితులకు సేకరించిన విరాళాలను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు అందజేస్తున్న కూటమి నాయకులు

చాగల్లు, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితులకు చాగల్లు మండలం నుంచి తెలుగుదేశం పార్టీతో పాటు కూటమి నాయకులు రూ. 17లక్షల 80 వేలు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని గురువారం కొవ్వూరులో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు అందజేసి సీఎంఆర్ఎఫ్‌కు అందజేయాలని కోరారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ళ హరిబాబు, టీడీపీ యువ నాయకులు నాదెళ్ళ శ్రీరామ్ మాట్లాడుతూ చాగల్లు నుంచి రూ.8లక్షల 05 వేలు, నెలటూరు నుంచి రూ.లక్ష, మల్లవరం రూ.లక్ష, చంద్రవరం రూ.లక్ష, మార్కొండపాడు రూ.లక్ష, దారవరం రూ. లక్ష, బ్రాహ్మణగూడెం రూ. లక్ష, ఎస్ ముప్పవరం రూ. 60 వేలు, నందిగంపాడు రూ. లక్ష 12 వేలు, ఊనగట్ల రూ. లక్ష 53 వేలు, కలవలపల్లి రూ. లక్ష వంతున విరాళాలు సేకరించినట్లు చెప్పారు. చిక్కాల నుంచి ఇంకా విరాళాలు సేకరణ జరుగుతుందన్నారు. విరాళాలు అందజేసిన మండల ప్రజలకు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు వారు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, చాగల్లు టీడీపీ అధ్యక్షుడు దొంగ రామకృష్ణ, టీడీపీతో పాటు కూటమి నాయకులు నందిగం శ్రీను, తాళ్ళూరి ప్రసాద్, కోడూరి కాశిగంగాధరరావు తదితరుల ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు.

కొవ్వూరులో విరాళాలు

కొవ్వూరు, సెప్టెంబర్ 19: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు కొవ్వూరు మండలంలోని పలు గ్రామాల నుంచి కూటమి నాయకులు విరాళాలు సేకరించి అందజేశారు. గురువారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు నాయకులు విరాళాల చెక్కులను అందజేశారు. మండలంలోని చిడిపి గ్రామ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో రూ. 85,500, పెనకనమెట్ట గ్రామ సర్పంచ్ మేకల శ్రీను రూ.50,000, మద్దూరు నాయుడు వీర్రాజు ఆధ్వర్యంలో రూ. 50వేలు, మారిశెట్టి వెంకటేశ్వరరావు రూ.20వేలు, కుమారదేవం గ్రామం నుంచి వట్టికూటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.1,26,000, నందమూరు గ్రామం నుంచి కంటిపూడి శ్రీనివాస్, గోపిల ఆధ్వర్యంలో రూ.లక్ష, మద్దూరు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో రూ.60 వేలు, పంగిడి పొట్రు సిద్ధూ రూ.25వేలు, అబ్యాస పాఠశాల రూ. 50వేల చెక్కులను ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు తదితరులతో పాటు ఆయా గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.



హైదరాబాదులో హర్యాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ నుంచి పురస్కారం అందుకుంటున్న కండక్టర్ ప్రసాద్

ఆర్టీసీ కండక్టర్ ప్రసాద్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం

గోపాలపురం, సెప్టెంబరు 19: ఆర్టీసీ కండక్టర్ కౌలూరి ప్రసాదరావుకు హైదరాబాదులో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ నివాసంలో ఫిలంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజయోన ఆధ్వర్యంలో గురువారం జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందించారు. మండలంలోని వేలచింతలగూడెంకు చెందిన ఆర్టీసీ కండక్టర్ కౌలూరి ప్రసాదరావు హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ నుంచి వివిధ రంగాల్లో కృషి చేసిన కవులు, కళాకారులను ఘనంగా సత్కరించినట్లు తెలిపారు. పుడమి సాహిత్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి పర్యవేక్షణలో ఉభయ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులకు అరుదైన గౌరవం దక్కినట్లు తెలిపారు. ఇటీవలే ఉషాపక్ష పత్రిక నిర్వహించిన కథల పోటీల్లో లవ్ అండ్ రొమాన్స్ కేటగిరిలో ఉద్ధతుల అనే కథకు ప్రథమ బహుమతి పొందినట్లు తెలిపారు. జాతీయ ప్రతిభా పురస్కారం పొందిన ప్రసాదరావును సహోద్యోగులు, గ్రామస్థులు, స్నేహితులు అభినందించారు.

అమెరికాలో ఆంధ్రా వాసి మృతి

నల్లజర్ల, సెప్టెంబరు 19: నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన ముత్తిన రమేష్(40) అమెరికాలో మృతి చెందినట్టు ఆయన సోదరుడు నరేష్ తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం... అమెరికా ఇల్నాయిస్ రాష్ట్రంలోని కార్‌బోనలే సిటిలోని సదరన్ ఇల్‌నాయిస్ యూనివర్శిటీలో మృతుడు రమేష్ ఎంఎస్ చదవడానికి 2022లో వెళ్ళాడన్నారు. ప్రైవేటుగా ఉద్యోగం చేస్తూనే చదువుకుంటున్నాడని, అక్కడి సిటిజన్‌తో రెండేళ్ల క్రితం వివాహం అయ్యిందన్నారు. కొంతకాలం తర్వాత ఆమెతో విబేధించి రమేష్ వేరుగా ఉంటున్నాడన్నారు. ఆదివారం రాత్రి బయటకు వెళ్ళి వచ్చి రూంలో పడుకున్నాడని అతని స్నేహితులు చెప్పినట్లు నరేష్ తెలిపారు. సోమ, మంగళవారాలు రమేష్ ఆచూకీ లేకపోవడం అతని రూం నుంచి దుర్వాసన రావడంతో ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించాడని తెలిపారు. పోలీసులు తలుపులు పగులగొట్టి చూడగా రమేష్ మృతి చెంది ఉన్నాడని, అక్కడి పోలీసులే బుధవారం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారని తెలిపారు. గుండెపోటు లేదా బ్రెయిన్ హెమరేజ్ వచ్చి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నట్టు నరేష్ తెలిపారు. మృతదేహన్ని ఇక్కడకు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. మృతుడికి తల్లి పండమ్మ, సోదరులు నాని, నరేష్ ఉన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

విద్యార్థులకు అవగాహన సదస్సు

నల్లజర్ల, సెప్టెంబరు 19: ఐసీడీయస్ ఆధ్వర్యంలో గురువారం నల్లజర్ల హైస్కూల్‌లో బేటి బచావో బేటి పడావో కార్యక్రమముపై కిశోర బాలికలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీయస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల వచ్చే నష్టాలను తెలిపారు. అదే విధంగా కిశోర బాలికలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లను చదివిద్దాం అనే నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కోమలి, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతి వల్లి, పేమవతి, శివకుమరి, దేవి, డ్వాక్రా సీఏలు శ్రీదేవి, పద్మ, ఎస్.పద్మజ పాల్గొన్నారు.

ఒక కంటెయినర్.. 53 ఎద్దులు

అక్రమ తరలింపు.. పోలీసుల అదుపులో నలుగురు



53 ఎద్దులను ఒకే కంటెయినర్‌లో కుక్కి తరలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 19: సరైన ఆహారం, నీరు అందించకుండా అక్ర మంగా తరలిస్తున్న పశువుల కంటెయినర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణ పోలీసుల వివరాల ప్రకారం.. పాయకరావుపేట సంత నుంచి 53 ఎద్దులను తమిళనాడుకు చెందిన కంటెనర్‌లో కుక్కేసి హనుమాన్ జంక్షన్ తరలిస్తుండగా కొవ్వూరు గామన్ బ్రిడ్జి వద్ద విశ్వ హిందూ పరిషత్ సభ్యులు అడ్డుకుని, పోలీసులకు సమాచారం అందజేశారు. పట్టణ సీఐ పి.విశ్వం, పట్టణ ఎస్ఐ కె.జగన్మోహన్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కంటెయినర్‌తో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పశువులను మండల కేంద్రమైన గోకవరం గోశాలకు తరలిస్తున్నట్లు సిఐ విశ్వం తెలిపారు.

డ్రగ్స్ తయారీదారుడి అరెస్ట్

నల్లజర్ల, సెప్టెంబరు 19: ఘంటావారిగూడెం వేరుశెనగ మిల్లులో డ్రగ్స్ తయారీ కేంద్రంపై ఇటీవల నార్కోటెక్ పోలీసులు మెరుపుదాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అప్పట్లో నలుగురిని అరెస్ట్ చేయగా ప్రధాన సూత్రదారి కొయ్యలగూడెం గ్రామానికి చెందిన సిద్ధు పరారీలో ఉండడంతో గురువారం నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆటలతో పాటీతత్వం మెండు

పెరవలి, సెప్టెంబరు 19: ఆటల పోటీల వల్ల పిల్లల్లో పోటీ తత్వం పెరుగుతుందని మండల పరిషత్ అధ్యక్షుడు కార్నెర్ల ప్రసాద్ పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖండవల్లి హైస్కూలులో మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ఆటల వల్ల ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసం కూడా పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా 14, 15 సంవత్సరాలలోపు బాల బాలికల పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచ్ పులిదిండి నాగరాజు ప్రారంభించారు. ఈ పోటీల్లో మండలంలోని ఏడు హైస్కూళ్ళకు చెందిన విద్యార్థులతో పాటు కానూరు శశి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి ఖండవల్లి సర్వోదయ స్కూలు కరస్పాండెంట్ బాబ్జి బహుమతులు అందజేశారు. 20వ తేదీన వాలీబాల్, ఖోఖో , కబడ్డీ , చెస్ , యోగా షటిల్ బాట్మింటన్ పోటీలు జరుగుతాయని ఫెడరేషన్ సెక్రటరి పల్లపు రాజు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమ, ఉపసర్పంచ్ అతికాల శ్రీనివాస్, ఎంపీటీసీ రవి కుమార్, విద్యాకమిటీ చైర్మన్ బీరా శ్రీనివాస్, ఆయా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహాపోషణ్

తాళ్లపూడి, సెప్టెంబరు 19: గర్భిణులు, బాలింతలు తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం తీసుకోవాలని వంటలు చేసేటప్పుడు పోషకాలు పోకుండా ఉండే పద్ధతిలో వంటలు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజరు భాగ్యకుమారి తెలిపారు. తాడిపూడిలో మహా పోషణ్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చే ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖా సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రవచనకర్త పరస రాధాకృష్ణను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ముగిసిన గణపతి నవరాత్రులు

తాళ్లపూడి, సెప్టెంబరు 19: తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామంలో శ్రీలక్ష్మీగణపతి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన చవితి ఉత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన లడ్డూల వేలంలో మొదటి 11 కిలోల లడ్డూను చాగల్లు నుంచి వచ్చిన యువత 16 వేలకు దక్కించుకున్నారు. రెండవ 6 కిలోల లడ్డూను రూ.11,500 కు తాడిపూడికి చెందిన నామా నరేంద్ర దక్కించుకున్నారు. అనంతరం గణపతి నవరాత్రుల సందర్భంగా తితిదే ధర్మ ప్రచారక్ పరస రాధాకృష్ణచే పురాణ ప్రవచనాలు నిర్వహించగా, కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయన్ను సత్కరించారు.